

ఢిల్లీలో నేషనల్ హైవే అథారిటీ చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్‌కు సమస్యలు వివరిస్తున్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

మాస్టర్ ప్లాన్‌పై అభ్యంతరాల వెల్లువ

ఎ-1 గ్రాండ్, 'రాడిసన్'కు మేలు చేసేందుకు ఒక వైపే రహదారి విస్తరణ

- రోడ్డుకు మరో వైపు స్థలాలు ఉన్నవారి అభ్యంతరం
- నేరెళ్లవలసలో వీఎంఆర్‌డీఏ ప్లాట్ల మధ్య నుంచే కోస్టల్ కారిడార్‌కు గతంలో ప్రతిపాదన
- తమకు న్యాయం చేయాలని స్థలాల యజమానుల విజ్ఞాపన
- దసపల్లా హిల్స్‌లో రహదారి విస్తరణ వద్దని స్థానికుల లేఖ



వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథ్‌లకు అభ్యంతరాల పత్రం అందజేస్తున్న దృశ్యం

- ఐదుగురు ఎమ్మెల్యేల నుంచి సూచనలు
- స్వయంగా దరఖాస్తులు స్వీకరించిన చైర్మన్, కమిషనర్లు

విశాఖపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) రూపొందించిన మాస్టర్ ప్లాన్-2041పై అభ్యంతరాలు వెల్లువెత్తుతున్నాయి. బుధవారం కార్యాలయంలో చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్‌లు స్వయంగా అభ్యంతరాలు స్వీకరించడంతో 20 బృందాలకుపైగా వచ్చి తమ గోడు వెల్లబోసుకున్నాయి. గతంలోనే తాము ఈ అభ్యంతరాలు చెప్పినప్పటికీ వైసీపీ పెద్దల స్వార్థ ప్రయోజనాల కోసం పట్టించుకోలేదని, ఇప్పటికైనా న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశాయి. ఈ మాస్టర్ ప్లాన్‌పై ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, పంచకర్ల రమేశ్‌బాబు, సుందరపు విజయకుమార్, వంశీకృష్ణ శ్రీనివాస్, విజయనగరం ఎమ్మెల్యే అదితి స్వయంగా వచ్చి పలు అంశాలపై అభ్యంతరాలు వ్యక్తంచేసి, కొన్ని సూచనలు చేశారు.

అభ్యంతరాల్లో కొన్ని...

● రుషికొండలో బీచ్ రోడ్డును 60 (200 అడుగులు) మీటర్లకు విస్తరించాలని ప్రతిపాదించారు. అంటే రోడ్డు మధ్య నుంచి అటు 30 మీటర్లు, ఇటు 30 మీటర్లు విస్తరించాల్సి ఉండగా, ఎ-1 గ్రాండ్ కన్వెన్షన్ సెంటర్ నిర్వాహకులకు లబ్ధి చేకూర్చడానికి వైసీపీ నేతలు మొత్తం విస్తరణను దానికి ఎదురుగా ఉన్న రోడ్డు వైపు ప్రతిపాదించారు. అది సర్వే నంబర్ 25లో ఉంది. అక్కడ సుమారు 30 మందికి ప్లాట్లు ఉన్నాయి. వారంతా దీనిపై గతంలోనే అభ్యంతరం వ్యక్తంచేసినా వైసీపీ పెద్దలు పట్టించుకోలేదు. ఇప్పుడు దానిని న్యాయబద్ధంగా చేయాలని వారంతా కోరారు. దీనిపై భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కూడా ఒక లేఖ సమర్పించారు.

● నేరెళ్లవలసలో ఎస్‌ఓఎస్ నుంచి 70 మీటర్ల రహదారిని ప్రతిపాదించారు. వాస్తవానికి అది కోస్టల్ కారిడార్ రహదారి. వైసీపీ పెద్దలకు ఆ ప్రాంతంలో ఉన్న భూములకు మేలు జరిగేలా దాన్ని అక్కడ ఇష్టం వచ్చినట్టు మలుపులు తిప్పారు. ఆ క్రమంలో వుడా గతంలో వేసిన లేఅవుట్ల ప్లాట్ల మీదుగా ఆ రహదారి వెళ్లింది. అది తప్పు అని తెలిసినా రాజకీయ ఒత్తిళ్లకు లొంగి అధికారులు దానినే ఖరారు చేశారు. తామంతా మధ్య తరగతి ప్రజలమని న్యాయం చేయాలని వారంతా కోరారు.

● మధురవాడ సర్వే నంబర్ 337/407లో రామానాయుడు స్టూడియో సమీపాన జర్నలిస్టుల లేఅవుట్ ... మిగతా 6వ పేజీలో

రోగులకు ఇబ్బంది లేకుండా చర్యలు

పాడైన డయాలసిస్ మెషీన్ల స్థానంలో కొత్తవి తీసుకుంటాం

- కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం

విశాఖపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో డయాలసిస్ చేయించుకునే కిడ్నీ రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని సూపరింటెండెంట్ డాక్టర్ వాణి పేర్కొన్నారు. 'పడకేసిన డయాలసిస్ యూనిట్లు' శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆమె స్పందించారు. నెఫ్రాలజీ విభాగానికి వెళ్లి అక్కడ పరిస్థితులను పరిశీలించారు. విభాగాధిపతితో చర్చించి రోగులకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ఆమె 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ సూపర్ స్పెషాలిటీ బ్లాక్ ఆవరణలో నెఫ్రో ప్లస్ ఆధ్వర్యంలో రోగులకు డయాలసిస్ సేవలు అందిస్తున్నామని, అందుకోసం 22 మెషీన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. వాటి ద్వారా ప్రతిరోజూ 55 నుంచి 60 వరకూ సెషన్స్ నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. నెఫ్రాలజీ విభాగంలో ఎనిమిది మెషీన్స్ ఉంటే, వాటిలో ఐదు కొన్నిరోజుల నుంచి పనిచేయడం లేదన్నారు. మూడు మెషీన్స్ సహాయంతో రోగులకు డయాలసిస్ సేవలు అందిస్తున్నట్టు వెల్లడించారు. మెషీన్స్ ... మిగతా 6వ పేజీలో

హైవేలో గ్రేడ్ సెపరేటెడ్ ఫ్లైఓవర్లు?

ఢిల్లీలో నేషనల్ హైవే అథారిటీ చైర్మన్‌ను కలిసిన ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే పల్లా

- సానుకూలంగా స్పందన
- విశాఖపట్నం-భోగాపురం మధ్య రహదారి విస్తరణకు వినతి



గ్రేడ్ సెపరేటెడ్ ఫ్లై ఓవర్ అంటే...

ట్రాఫిక్ ఎక్కువగా ఉండే జంక్షన్‌లలో ఫ్లైఓవర్ నిర్మించడంతో పాటు దాని కిందన, అవసరమైతే ఇరువైపుల నుంచి వాహనాల రాకపోకలకు అనుకూలంగా వివిధ స్థాయిల్లో మార్గాలు ఏర్పాటు చేయడాన్ని గ్రేడ్ సెపరేట్ ఫ్లైఓవర్‌గా వ్యవహరిస్తారు. ఎన్‌ఏడీ జంక్షన్‌లో నిర్మించినది గ్రేడ్ సెపరేటెడ్ ఫ్లైఓవరే..

విశాఖపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో జాతీయ రహదారిపై 'గ్రేడ్ సెపరేటెడ్ ఫ్లైఓవర్లు' వచ్చే అవకాశం ఉందని సమాచారం. భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం పనులు చకచకా జరుగుతున్నాయి. వచ్చే జూన్‌లో అది అందుబాటులోకి వస్తుంది. విమానాశ్రయానికి వెళ్లే వారంతా తప్పనిసరిగా హైవే పైనే ప్రయాణించాల్సి ఉంటుంది. అయితే గాజువాక మొదలుకొని ఆనందపురం జంక్షన్ వరకూ ప్రస్తుతం ఎక్కడికక్కడే జంక్షన్లు ట్రాఫిక్‌తో జామ్ అయిపోతున్నాయి. నగరంలో ఏ కార్యక్రమమైనా నిర్వహించాల్సి వచ్చినప్పుడు ట్రాఫిక్‌ను మళ్లిస్తే కొన్ని గంటల పాటు వాహనాలు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నాయి. భోగాపురం విమానాశ్రయం ప్రారంభమైన తరువాత ఇదే పరిస్థితి ఎదురైతే చాలామంది వారి విమానాలను అందుకోలేని పరిస్థితి వస్తుంది. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకునే గతంలో నగరంలో ఎనిమిది ఫ్లైఓవర్ల నిర్మాణానికి ప్రతిపాదించారు. అయితే కొత్త ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మెట్రో రైలు ప్రాజెక్టుతో ఫ్లైఓవర్లను ముడిపెట్టి డబుల్ డెక్కర్ మోడల్‌లో నిర్మాణం చేపడతామని చెబుతున్నారు.

ఈ ప్రాజెక్టు పట్టాలపైకి వచ్చి, నిధులు మంజూరై నిర్మాణాలు చేపట్టి పూర్తయ్యేసరికి చాలా ఏళ్లు పడుతుంది. అంతవరకూ ట్రాఫిక్ సమస్యలు తీరే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో విశాఖ ఎంపీ శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావులు బుధవారం ఢిల్లీలో నేషనల్ హైవే అథారిటీ చైర్మన్ సంతోష్‌కుమార్ యాదవ్‌ను కలిసి మాట్లాడారు. విశాఖపట్నం-భోగాపురం మధ్య జాతీయ రహదారి, దాని విస్తరణపై చర్చించారు. ఈ మార్గంలో రహదారిని విస్తరించడంతో పాటు గ్రేడ్ సెపరేటెడ్ ఫ్లైఓవర్లు నిర్మించాలని కోరారు. దానికి ఆయన సానుకూలంగా ... మిగతా 6వ పేజీలో

పార్కు పనుల్లో అవినీతిపై అధికారుల మౌనం

- అవకతవకలు జరిగినట్టు కళ్లకు కనిపిస్తున్నా చర్యలకు మీనమేషాలు



'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం

విశాఖపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 28వ వార్డు పరిధి పేకర్ లేఅవుట్‌లోని పార్కులో రూ.1.4 కోట్ల వ్యయంతో చేపట్టిన పనుల్లో అవినీతి జరిగినట్టు కళ్లకు కట్టినట్టు కనిపిస్తున్నా చర్యలకు అధికారులు వెనుకడుగు వేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పార్కులో ప్రహరీ గోడ నిర్మాణం, వాటర్ ఫౌంటెయిన్, గ్యాలరీ, నడకదారి, ల్యాండ్ స్కేపింగ్ వంటి ఎనిమిది పనులకు జీవీఎంసీ రెండేళ్ల కిందట రూ.1.6 కోట్ల వ్యయంతో టెండర్లు పిలిచింది. ఏడు పనులకు టెండర్లు ఖరారయ్యాయి. వాటిలో ఒక పనిని కాంట్రాక్టర్ పూర్తిగా వదిలేయగా, మిగిలిన పనులను చేపట్టారు. కానీ అన్ని పనులకు బదులుగా ఒక ప్రహరీ గోడను మాత్రమే నిర్మించారు. ఆ నిధులన్నీ ప్రహరీ గోడకే సరిపోయాయంటూ మిగిలిన పనులను ఆపేశారు. అయినప్పటికీ అధికారులు మాత్రం అన్నిపనులు పూర్తయినట్టు రికార్డుల్లో చూపించి, కాంట్రాక్టర్‌కు గత ఏడాది డిసెంబరులో బిల్లులు చెల్లించేశారు. ఈ విషయం వెలుగుచూసినా బాధ్యులపై చర్యలు తీసుకోకుండా జీవీఎంసీ అధికారులు తాత్సారం చేస్తుండడం అనుమానాలకు తావిస్తోంది. దీనిపై చీఫ్ ఇంజనీర్ పల్లంరాజు వద్ద ప్రస్తావించగా, తాను ఆ పనులకు సంబంధించిన ఫైళ్లను తెప్పించుకోలేదని, వాటిని చూసిన తర్వాత ఏదైనా స్పందించగలనని అన్నారు. సుమారు రూ.1.4 కోట్ల విలువైన పనులను పూర్తిస్థాయిలో చేయకుండానే బిల్లులు డ్రా చేసినట్టు బయటపడినా మౌనం దాల్చడం వెనుక ఆంతర్యమేమిటనే దానిపై రకరకాల ప్రచారం జరుగుతోంది.

జోన్ -3 ఈఈ పోలాకి ఆకస్మిక బదిలీ

- విధుల్లో చేరకుండా సెలవు

విశాఖపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఏపీఈపీడీసీఎల్ అధికారులు బదిలీల గడువు ముగిసిన తరువాత చేసిన ఒకే ఒక్క బదిలీ విద్యుత్ శాఖ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మధురవాడ జోన్-3 ఈఈగా పనిచేస్తున్న పోలాకి శ్రీనివాసరావును ఈ నెల 10వ తేదీన నగరంలోని జోన్-1కు బదిలీ చేశారు. ఆ స్థానంలో జోన్-1లో ఈఈగా పనిచేస్తున్న బి.సింహాచలంనాయుడును వేశారు. ఈ ఉత్తర్వులు ఆ రోజు మధ్యాహ్నం రాగా అదేరోజు రాత్రి సింహాచలంనాయుడు విధుల్లో చేరిపోయారు. ఐదు రోజులైనా జోన్-1 ఈఈగా పోలాకి శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టలేదు. బీసీ నాయకుడిగా గుర్తింపు పొందిన తనను రాజకీయ ఒత్తిళ్లకు లొంగి బదిలీ చేశారని కినుక వహించి విధులకు దూరంగా ఉన్నట్టు తెలిసింది. ఉద్యోగ సంఘాల నాయకుడిగా ఉన్న తనను పిలిచి తప్పనిసరి స్థితిలో బదిలీ చేయాల్సి వస్తున్నదని ఒక మాట చెప్పినా బాగుండేదని సన్నిహితుల వద్ద వ్యాఖ్యానిస్తున్నట్టు తెలిసింది. శ్రీకాకుళానికి చెందిన కేంద్ర మంత్రి పట్టుబట్టి సింహాచలంనాయుడును మధురవాడకు బదిలీ చేయించారని ప్రచారం జరుగుతోంది. సింహాచలంనాయుడు గతంలో రెండు దఫాలు అదే జోన్-3 ఈఈగా బాధ్యతలు నిర్వహించారు. ఇది భీమిలి నియోజకవర్గానికి చెందిన వ్యవహారం కాగా స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కూడా కేంద్ర మంత్రి ఏడాది నుంచి ఈ బదిలీ కోసం కోరుతుండడంతో కాదనలేక అంగీకరించినట్టు తెలుస్తోంది.

స్మార్ట్ సిటీ ప్రాజెక్టుకు రూ.5.2 కోట్లు విడుదల

విశాఖపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా స్మార్ట్ క్యాంపస్ పనుల కోసం రూ.5.2 కోట్లు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. జీవీఎంసీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక విద్యా బోధన అమలుకోసం స్మార్ట్ క్యాంపస్ పేరుతో పనులుచేపట్టింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో నాలుగో విడత కింద ఈ నిధులను విడుదల చేస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది.

వేతనాల కోసం ఎదురుచూపులు

మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు ఇంతవరకూ అందని జీతాలు



విశాఖపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి):

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా గత నెలలో బదిలీ అయిన ఐదు వేల మంది ఉపాధ్యాయుల్లో దాదాపు 1,500 మందికి జూన్ నెల జీతాలు ఇంతవరకూ అందలేదు. కొత్తగా ఏర్పాటు చేసిన మోడల్ ప్రాథమిక పాఠశాలలు, యూపీ నుంచి ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేసిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు జీతాలు రాలేదు.

- అప్‌గ్రేడ్ అయిన యూపీ పాఠశాలల్లో నియమితులైన గ్రేడ్-2 హెచ్‌ఎంలకు కూడా...
- పోస్టుల కేటాయింపుపై గందరగోళం
- విద్య, ట్రెజరీ శాఖల మధ్య సమన్వయలోపం
- వచ్చే నెల కూడా కష్టమే...

నూతన సంస్కరణల అమలులో భాగంగా ఉమ్మడి జిల్లాలో 538 మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటుచేశారు. మోడల్ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా స్కూల్ అసిస్టెంట్లు, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలను నియమించారు. అయితే కొత్తగా ఏర్పాటుచేసిన మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలకు జీతాలు రావాలంటే సదరు పోస్టులు మంజూరుకావాలి. దీనికి ఆర్థిక శాఖ అనుమతి ఇవ్వాలి. ఆ తరువాత ఖజానా శాఖ పొజిషన్ ఐడీలు కేటాయించాలి. ఈ ప్రక్రియ ఇంతవరకూ పూర్తికాలేదు. మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో హెచ్‌ఎంతోపాటు మరో నలుగురు టీచర్లను నియమించారు. ఈ పోస్టులను కూడా ప్రభుత్వం గుర్తించి ఆమోదించాలి. అప్పుడే జీతాల చెల్లింపునకు అనుమతి వస్తుంది.

అదేవిధంగా ఉమ్మడి జిల్లాలో 34 యూపీ పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయడంతో గ్రేడ్-2 హెచ్‌ఎంలను అక్కడ నియమించారు. గ్రేడ్-2 హెచ్‌ఎంలు అంటే అప్పటివరకూ ఉన్నత పాఠశాలల్లో పనిచేసిన గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు. కొత్తగా అప్‌గ్రేడ్ అయిన పాఠశాలల హెచ్‌ఎం పోస్టులను కూడా ప్రభుత్వం మంజూరుచేయాలి. లేదంటే పదోన్నతి ద్వారా స్కూలు అసిస్టెంట్‌లను నియమించాలి. అప్పుడే హెచ్‌ఎంలకు జీతాలు వచ్చేందుకు అవకాశం వస్తుంది. 34 యూపీ పాఠశాలల హెచ్‌ఎం పోస్టులు స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో ఉన్నాయి తప్ప గెజిటెడ్ హెచ్‌ఎం పోస్టులు కాదు. వీరికి జీతాలు రావాలంటే పాఠశాల విద్యా శాఖ ప్రత్యేకించి పోస్టులు కేటాయించి, ఆ విషయాన్ని ఖజానా శాఖకు పంపాలి. కాగా ఈ ఏడాది జిల్లాలో మోడల్ ప్రాథమిక పాఠశాలలతో పాటు విద్యార్థులు పెరిగిన పాఠశాలల్లో టీచర్లను నియమించారు. గత నెలలో జరిగిన బదిలీల్లో ఈ ప్రక్రియ చేపట్టారు. విద్యార్థులు తక్కువ ఉన్న పాఠశాలల నుంచి ఎక్కువగా ఉన్న చోటకు పోస్టు బదిలాయింపు చేయాలి. దీనికి అనుగుణంగా కొత్తగా పాఠశాలలో నియమితులైన టీచర్‌కు పొజిషన్ ఐడీ కేటాయించాలి. అయితే ఈ విషయంలో విద్యా శాఖ ముందుగా అప్రమత్తం కాలేదని టీచర్లు వాపోతున్నారు. ప్రధానంగా మండల విద్యా శాఖాధికారులు చొరవ తీసుకుని బదిలీపై వచ్చిన టీచర్లను రెండు కేటగిరీలుగా విభజించలేదని తప్పుబడుతున్నారు. రెగ్యులర్ పోస్టులోకి వచ్చిన టీచర్‌కు ... మిగతా 6వ పేజీలో

27 మంది వైసీపీ కార్పొరేటర్లకు షోకాజ్ నోటీసు

- మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో విప్‌ను ధిక్కరించారని కలెక్టర్‌కు పార్టీ ఫిర్యాదు

విశాఖపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో పార్టీ విప్‌ను ధిక్కరించి ఓటు వేశారనే అభియోగంపై వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 27 మంది కార్పొరేటర్లకు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ షోకాజ్ నోటీస్ జారీ చేశారు. గత మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై ఈ ఏడాది మార్చిలో కూటమి కార్పొరేటర్లు అవిశ్వాసం ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్‌కు నోటీస్ ఇచ్చారు. అదేవిధంగా డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌పై కూడా అవిశ్వాసం ప్రకటించారు. ఆ నోటీస్‌ల ఆధారంగా ఏప్రిల్ 19న మేయర్ హరివెంకటకుమారిపైనా, 22న జియ్యాని శ్రీధర్‌పైనా ఓటింగ్ నిర్వహించారు. వైసీపీకి చెందిన కార్పొరేటర్లంతా అవిశ్వాసానికి వ్యతిరేకంగా ఓటు వేయాలని ఆదేశిస్తూ ఆ పార్టీ విప్ జారీచేసింది. కానీ 27 మంది కార్పొరేటర్లు టీడీపీ, జనసేన, బీజేపీల్లో చేరిపోయి మేయర్, డిప్యూటీ మేయర్‌లపై పెట్టిన అవిశ్వాసానికి అనుకూలంగా ఓటేశారు. దీంతో మేయర్, డిప్యూటీ మేయర్ ఇద్దరూ పదవిని కోల్పోయారు. పార్టీ విప్‌ను ధిక్కరించి అవిశ్వాసానికి అనుకూలంగా ఓటేసిన కార్పొరేటర్లపై చర్యలు తీసుకోవాలంటూ ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్‌కు వైసీపీ రాష్ట్ర కార్యదర్శి తైనాల విజయ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదును రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి పంపించిన జిల్లా కలెక్టర్, అక్కడి నుంచి అందిన ఆదేశాల మేరకు విప్‌ను ఉల్లంఘించి ఓటేసిన 27 మంది కార్పొరేటర్లకు మునిసిపల్ కార్పొరేషన్ రూల్స్-2008లోని రూల్ నంబర్ 17 ప్రకారం నోటీసులు జారీచేశారు. నోటీస్ అందుకున్న వారంతా వారం రోజుల్లోగా తమ వివరణను తెలియజేయాలని, లేనిపక్షంలో తదుపరి చర్యలకు అర్హులవుతారని పేర్కొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ కొనసాగింపుపై సందిగ్ధం

తాజాగా ఆన్‌లైన్‌లో నోటిఫికేషన్ ఇచ్చిన ఏయూ అధికారులు

- గతంలో మాదిరిగా తమనే రెన్యువల్ చేయాలని డిమాండ్ చేస్తున్న అతిథి అధ్యాపకులు



విశాఖపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రస్తుతం పనిచేస్తున్న అతిథి అధ్యాపకుల (గెస్ట్ ఫ్యాకల్టీ) కొనసాగింపుపై సందిగ్ధం నెలకొంది. గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి యూనివర్సిటీ అధికారులు తాజాగా నోటిఫికేషన్ ఇవ్వడం క్యాంపస్‌లో చర్చనీయాంశంగా మారింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆన్‌లైన్‌లో నోటిఫికేషన్ ఇవ్వడంపై ప్రస్తుతం ఉన్న అతిథి అధ్యాపకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారికి ఇప్పటివరకూ పాఠాలు చెప్పేందుకు అనుగుణంగా షెడ్యూల్ కూడా ఇవ్వ లేదు. ప్రస్తుతం ఏయూలోని వివిధ విభాగాల్లో 400 మంది అతిథి అధ్యాపకులు పనిచేస్తున్నారు. గెస్ట్ ఫ్యాకల్టీని ప్రసాదరెడ్డి వీసీగా ఉన్న సమయంలో తొలగించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ శశిభూషణ్ తిరిగి తీసుకున్నారు. వారికి సెమిస్టర్/పేపర్‌కు రూ.45 వేలు చొప్పున వేతనంగా చెల్లిస్తుంటారు. ఏటా రెన్యువల్ చేస్తుంటారు. అయితే, ఏయూ అధికారులు తొలిసారి ఆన్‌లైన్‌లో నోటిఫికేషన్ ఇచ్చారు. అయితే, దీనిని ప్రస్తుతం పనిచేస్తున్న అతిథి అధ్యాపకులు వ్యతిరేకిస్తున్నారు. తమకు రెన్యువల్ చేయాలని, లేదంటే సామర్థ్యాలను తెలుసుకునేందుకు రివ్యూస్ కండక్ట్ చేయాలని కోరుతున్నారు. వర్సిటీ అధికారులు ఇప్పటివరకూ ఎటువంటి హామీ ఇవ్వలేదు. పోస్టులకు ... మిగతా 6వ పేజీలో

ఒడిశాలో బర్డ్‌ఫ్లూ

అక్కడ నుంచి ఉత్తరాంధ్రకు కోళ్లు

- స్థానిక పౌల్ట్రీ రైతులు అప్రమత్తం
- ఫ్లూ తగ్గేంత వరకూ దిగుమతులు ఆపాల్సిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి



గంటాకు వినతిపత్రం అందజేస్తున్న బ్యాగ్ ప్రతినిధులు

విశాఖపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఒడిశాలో కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకుతోంది. ఈ విషయాన్ని అక్కడ పశు సంవర్ధక శాఖ అధికారులు ధ్రువీకరించారు. ఈ నేపథ్యంలో ఒడిశాలో చికెన్ అమ్మకాలు గణనీయంగా పడిపోవడంతో ధరలు పతనమయ్యాయి. దీంతో ఒడిశా నుంచి పొరుగునున్న శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల గుండా ఉత్తరకోస్తా జిల్లాలకు కోళ్లు పెద్దఎత్తున దిగుమతి అవుతున్నాయి. రాజమండ్రి వరకూ వెళుతున్నాయి. ఉత్తర కోస్తాలో ఫారం ధర రూ.70 ఉండగా, ఒడిశా నుంచి కోళ్లను రూ.35 నుంచి రూ.40కు సరఫరా చేస్తున్నారు. ఉత్తరకోస్తాకు రోజుకు 250 నుంచి 300 వ్యాన్‌లలో ఒడిశా కోళ్లు దిగుమతి అవుతున్నట్టు స్థానికంగా ఉన్న కోళ్ల రైతులు చెబుతున్నారు. ఒడిశా నుంచి తెచ్చిన కోళ్లను రిటైల్ మార్కెట్‌లో వెంకాబ్, బ్యాగ్ నిర్ణయించిన ధరకే విక్రయిస్తున్నారు. ఇదిలావుండగా ... మిగతా 6వ పేజీలో



గరుడ వాహనంపై స్వామివారు

అప్పన్నకు వైభవంగా గరుడ సేవ

సింహాచలం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా బుధవారం గరుడసేవ, నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామి వారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని పలు పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి రజిత గరుడ వాహనంపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామార్చన జరిపారు. సన్నాయి వాయిద్యాల నడుమ గరుడ వాహనంపై ఉన్న స్వామివారి చుట్టూ భక్తులు ప్రదక్షిణ చేశారు. తరువాత అదే వేదికపై నిత్య కల్యాణం నిర్వహించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ఆనందపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతిఒక్కరికి అవగాహన అవసరమని చిట్టివలస అగ్నిమాపక కేంద్రం అధికారి శ్రీనివాసరావు సూచించారు. బుధవారం ఎల్‌వీపాలెం పంచాయతీలో హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంక్ సిబ్బందికి అధికారులు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బంక్‌ల్లో ప్రమాదం జరిగితే సేఫ్టీ గ్యాస్ సిస్టమ్ ద్వారా మంటలను అదుపు చేయవచ్చనన్నారు. ప్రతి బంక్‌లో తప్పనిసరిగా సేఫ్టీ పరికరాలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బంక్ నిర్వాహకులు పూడి రమేశ్, లీడింగ్ ఫైర్‌మెన్‌లు చక్రవర్తి, రమేశ్‌బాబు, శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై కర్కాటక సంక్రమణ తిరువీధి



తిరువీధిలో స్వామివారు

సింహాచలం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : కర్కాటక సంక్రమణ పుణ్య దినాన్ని పురస్కరించుకుని సింహగిరిపై అప్పన్న స్వామి తిరువీధి బుధవారం వైభవంగా నిర్వహించారు. రాత్రి ఆరాధనకు ముందు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులను శోభాయమానంగా అలంకరించి పల్లకిలో అధిష్ఠింపజేశారు. పండితుల వేదమంత్రోచ్చారణలు, విద్వాంసుల నాదస్వరాలపనలు నడుమ నాలుగు మాడవీధుల్లో తిరువీధి ఉత్సవం జరిపారు.మార్గం పొడవునా భక్తులు కర్పూర నీరాజనాలతో స్వామివారిని ఆహ్వానించారు.అనంతరం రాత్రి ఆరాధన, పవళింపు సేవ జరిపి ఆలయ కవాట బంధనం చేశారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

భీమునిపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ అప్లికేషన్స్ బోధించడానికి గెస్ట్ అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ తెలిపారు. బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. కంప్యూటర్ కోర్సులో పీజీ చేసి 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు లేదా నెట్, సెట్, పీహెచ్‌డీ చేసిన వారు అర్హులని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 22న కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని ఆమె సూచించారు.

బోయవీధిలో 'తొలి అడుగు'



కార్యక్రమంలో పాల్గొన్న కూటమి నాయకులు, కార్యకర్తలు

భీమునిపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజా అవసరాలను గుర్తించి, వాటి పరిష్కారమే లక్ష్యంగా కూటమి పాలన సాగుతోందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. పట్టణంలోని బోయవీధిలో బుధవారం సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ఏడాదిలో ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాసరపు నాగరాజు, మారోజు సంజీవ కుమార్, కొక్కిరి అప్పన్న, వాడమొదల సత్యారావు, నక్కిళ్ళ వెంకటరావు, శ్రీను స్వామి పాల్గొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భీమునిపట్నం రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దాకమర్రి రూరల్ ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్ 3 ఈఈ సింహాచలంనాయుడు తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. టి. నగరపాలెం, కనకలపేట, లక్ష్మీపురం, మజ్జివలస, సింగనబంద, విజయరాంపురం, కృష్ణంరాజుపేట,మద్దిలపేట, నారాయణరాజుపేట ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.

కొమ్మాది : కొమ్మాది విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని బి2 కాలనీ, శంభువానిపాలెం, బక్కన్నపాలెం, ఎన్‌టీఆర్ కాలనీ, లచ్చిరాజు లేఅవుట్, పోలీస్ బెటాలియన్ ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా ఉండదని ఏఈ తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

ఉపాధ్యాయులకు సన్మానం

తగరపువలస, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేసి వేరేచోటకు బదిలీ అయిన రోజామణిని ఆ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాలకు హెచ్‌ఎం రోజామణి చేసిన అభివృద్ధి పనులు, సేవా కార్యక్రమాలను పలువురు కొనియాడారు. ఆమెతో పాటు బదిలీ అయిన మరో ఇద్దరు ఉపాధ్యాయులను కూడా సన్మానించారు.



బదిలీ అయిన హెచ్‌ఎం రోజామణి, ఉపాధ్యాయులకు సన్మానం







బీచ్ రోడ్డులో రంగులతో సుందరంగా కనిపిస్తున్న గౌతమ బుద్ధుడు విగ్రహాలు, డాల్ఫిన్‌ల సమూహం, లవ్ భీమిలి ఎంబ్లమ్

సుందరంగా భీమిలి బీచ్

- రూ. 15 లక్షల జీవీఎంసీ నిధులతో నూతన హంగులు
- రంగులతో కళకళలాడుతున్న కళా ఖండాలు
- ఫొటోలు దిగుతూ పర్యాటకుల సందడి

భీమునిపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : భీమిలి బీచ్ సోయగాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. జీవీఎంసీ మంజూరు చేసిన రూ. 15 లక్షల సాధారణ నిధులతో ఇంజనీరింగ్ విభాగం బీచ్ రోడ్‌ను సుందరంగా తీర్చిదిద్దింది. రంగులు వెలసి కళావిహీనంగా ఉన్న లవ్ భీమిలి ఎంబ్లమ్‌ను కొత్త రంగులు వేసి, అందంగా తయారు చేశారు. చుట్టూ స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు చేశారు. అలాగే డాల్ఫిన్ బొమ్మలను కూడా ఆకర్షణీయంగా తయారుచేశారు. శిష్యులకు బోధన చేస్తున్న గౌతమ బుద్ధుడు విగ్రహాలకు సరికొత్తగా రంగులు అద్ది ఆకర్షణీయంగా రూపొందించారు. మత్స్యకారుడి జీవన సౌందర్యాన్ని కళ్లెదుట నిలిపే నిలువెత్తు విగ్రహానికి కూడా రంగులు అద్దారు. మహాత్మా గాంధీజీ విగ్రహాలకు, మౌన ముద్రలో ఉన్న బుద్ధుడు, సాగర సంగమ ప్రవేశద్వారం తదితర వాటిని అందంగా తీర్చిదద్దడంతో సందర్శకులు వాటి వద్ద ఫొటోలు దిగుతూ సందడి చేస్తున్నారు. కాగా 2023 మార్చిలో జరిగిన బీచ్ రోడ్ ఆధునికీకరణ పనుల్లో అసంపూర్తిగా మిగిలి ఉన్న గాంధీజీ పార్క్, బీచ్‌పార్క్‌లోని గ్రానైట్ పనులను జీవీఎంసీ నిధులతో పూర్తి చేస్తామని అధికారులు చెప్పినప్పటికీ ఇప్పటివరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ పనులను కూడా పూర్తి చేసి బీచ్ రోడ్డును మరింత ఆకర్షణీయంగా తయారు చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.



మత్స్యకారుడి జీవన సౌందర్యం

సంక్షేమ పాలన కూటమికే సాధ్యం

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

పద్మనాభం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ప్రణాళికాబద్ధంగా కూటమి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. బుధవారం ఆయన రేవిడి, వెంకటాపురం గ్రామాల్లో నిర్వహించిన సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఒక్కో పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధిని, యువత భవిష్యత్తును గాలికి వదిలేసిందన్నారు. తమ ప్రభుత్వం ఒకవైపు సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంతో పాటు గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడం, యువతకు ఉపాధి కల్పనకు పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తుందన్నారు. ప్రజలకు అవసరమైన తాగునీరు, రహదారి, వసతి వంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు ఏమేరకు అందుతున్నాయని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రజలతో మాట్లాడి వారి కష్టసుఖాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం. విజయకుమార్, వెంకటాపురం సర్పంచ్ కె. రమణ, కాపు కార్పొరేషన్ డైరెక్టరు కె. లీలావతి, కృష్ణాపురం ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు కె. రమణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె. దామోదరరావు, టీడీపీ నాయకులు గంగరాజు, అప్పలనాయుడు, నగేశ్ కుమార్, మొల్లి లక్ష్మణరావు, పల్లా రాము, గెద్ద ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



రేవిడిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

స్మార్టు మీటర్లను రద్దు చేయాలి : సీపీఐ

మధురవాడ, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల విద్యుత్ వినియోగదారులు దోపిడీకి గురవుతారని, వెంటనే వాటిని రద్దు చేయాలని సీపీఐ జిల్లా నాయకుడు మరుపిళ్ల పైడిరాజు డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిరసిస్తూ బుధవారం ఏడో వార్డు పరిధిలోని మల్లయ్యపాలెం, అయోధ్యనగర్‌లో సీపీఐ ఆధ్వర్యం లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు ఖరీదును వినియోగదారులే భరించాలన్నారు. సింగిల్ ఫేజ్ మీటరు ఖరీదు రూ.8,927, త్రీ ఫేజ్ మీటరు ఖరీదు రూ.17,286 ఉంటుందన్నారు. ఈ మొత్తాలను 93 వాయిదాల్లో బిల్లులతో పాటు వినియోగదారులే చెల్లించవలసి ఉంటుందని, స్మార్ట్ మీటర్ల ప్రీపెయిడ్ కారణంగా ముందుగానే ప్రజలు అందులో రీచార్జ్ చేయించాలన్నారు. రీచార్జ్ పూర్తి కాగానే ఇంటికి విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని చెప్పారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో పాటు వాటి మరమ్మతు చార్జీలు కూడా వినియోగదారులదే భరించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ చార్జీల భారం వేయడం విరమించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మధురవాడ ఏరియా కార్యదర్శి వాండ్రాసి సత్యనారాయణ, ఎంఎస్ పాత్రుడు, డి. రాజేష్, ఆదినారాయణ, పి. రమణ, తదితరులు పాల్గొన్నారు.



మల్లయ్యపాలెంలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

తగరపువలస : స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో చిట్టివలసలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ భీమిలి జోన్ కార్యదర్శి మూర్తి మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రజలంతా వ్యతి రేకించాలని పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లు వల్ల అధిక బిల్లులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్. అప్పలనాయుడు, మంగశ్రీ, రాంబాయి, వెంకయ్య, బంగారమ్మ పాల్గొన్నారు.

నేటి నుంచి డీఈఈ సెట్ సర్టిఫికెట్ల పరిశీలన

భీమునిపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (డీఈఈ సెట్)లో అర్హత సాధించిన విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను డైట్ కళాశాలలో శుక్రవారం నుంచి ఈనెల 22వ తేదీ వరకూ పరిశీలించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థులు వారికి కేటాయించిన తేదీల్లో సంబంధిత ఒరిజినల్ ధ్రువపత్రాలు, ఒకసెట్ జిరాక్స్ కాపీలతో డైట్ కళాశాలకు హాజరుకావాలని తెలిపారు.

ఘనంగా రామాలయం వార్షికోత్సవం

పద్మనాభం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకటాపురంలో సీతారామాలయం వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత సీతారాములకు విశేష అర్చనలు, పూజలు నిర్వహించారు. రేవిడి, వెంకటాపురం, అన్నంపేట, రౌతులపాలెం గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కూడా స్వామిని దర్శించుకున్నారు.

ఏపీటీఎఫ్ మండల నూతన కార్యవర్గం

పద్మనాభం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని కుంతీమాధవస్వామి ఆలయ ఆవరణలో ఏపీటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం జరిగింది. జిల్లా అధ్యక్షుడు కరుణాకర్, కార్యదర్శి ఆర్. చంద్రకళ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక నిర్వహించారు. మండల గౌరవాధ్యక్షుడిగా జి. ఎర్రయ్య, అధ్యక్షుడిగా ఆర్. మహేష్, ఉపాధ్యక్షులుగా ఆదిబాబు, విద్యా మోహన, రామునాయుడు, ప్రధాన కార్యదర్శిగా గౌరినాయుడు, కార్యదర్శులుగా మోహన్, మహేష్, శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులుగా దేవి, శ్రీనివాస్, సన్యాసిరావు, ఉమాదేవి, జిల్లా కౌన్సిలర్లుగా రామకృష్ణ, రమణ, సత్యం, సూర్యనారాయణ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గంతో సమావేశం నిర్వహించారు.

వరి నారుమడుల్లో సస్యరక్షణ చర్యలు

పద్మనాభం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్‌లో వరి నారుమళ్లకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఎలమంచిలి వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి, మండల వ్యవసాయాధికారి ఎంపీఎస్ చలం సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధ వారం వారు కృష్ణాపురం, భద్రయ్యపేట గ్రామాల్లోని వరి నారుమళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నారుమడి యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. వరినారులో ప్రస్తుతం రసం పీల్చే పురుగు, తామర పురుగు ఆశించే అవకాశం ఉందని, తామర పురుగు వల్ల ఆకు పసుపు రంగులోకి మారుతుందన్నారు. దీని నివారణకు డైమిథియేట్ 2 మి.లీ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. పాము పొడ తెగులు కూడా వ్యాపించే అవకాశం ఉందన్నారు. దీని నివారణకు ప్రాపికోనజోల్ 1మి.లీ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. నారు వేసేటప్పుడు తప్పనిసరిగా కిలో విత్తనానికి 2 గ్రాముల కార్బండిజంతో విత్తన శుద్ధి చేసి, నాటాలని సూచించారు.



కృష్ణాపురంలో నారుమడిని పరిశీలిస్తున్న శాస్త్రవేత్త కుమారి

పారిశుధ్యం మెరుగుపై శ్రద్ధ చూపాలి

జిల్లా పరిషత్ సీఈఓ నారాయణమూర్తి

పద్మనాభం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీలు పారిశుధ్యాన్ని మెరుగుపరచడంలో ప్రత్యేక శ్రద్ధ చూపా లని జిల్లా పరిషత్ సీఈఓ పి. నారాయణమూర్తి చెప్పారు. మండలంలోని కోరాడ, రెడ్డిపల్లి గ్రామాల్లో అమలవుతున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావుతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తీసుకువెళ్లి తడి చెత్తతో వానపాము ఎరువు తయారు చేయాలన్నారు. పొడి చెత్తను రకాల వారీగా వేరు చేయాలని సూచించారు. మంచినీటి పథకాలను క్రమం తప్పకుండా క్లోరినేషన్ చేయించాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను ఆదేశించారు. పారిశుధ్యం మెరుగ్గా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. అనంతరం ఆయా గ్రామాల్లో సంపద తయారీ కేంద్రాలను, రక్షిత మంచినీటి పథకాలను పరిశీలించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.విజయకుమార్, డిప్యూటీ ఎంపీడీఓ మీనాకుమారి, పాల్గొన్నారు.



కోరాడలో మహిళతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నారాయణమూర్తి

మాస్టర్ ప్లాన్‌పై అభ్యంతరాల వెల్లువ

... 5వ పేజీ తరువాయి

మీదుగా ప్రతిపాదించిన 18 మీటర్ల రహదారిని తొలగించాలని సంఘం ప్రతినిధులు కోరారు.

- దసపల్లా హిల్స్ సర్వే నంబరు 1196లో నౌరోజీ రోడ్డు నుంచి వాల్తేరు మెయిన్ రోడ్డును కలుపుతూ వైసీపీ పెద్దలకు మేలు జరిగేలా చేపట్టిన రహదారి విస్తరణను నిలిపివేయాలని అక్కడ నివాసితులు కోరారు. అందరికీ అవసరమైన పార్కు ఏర్పాటుచేయాలని కోరారు.
- నిడిగట్టు గ్రామంలో ప్రతిపాదిత 24 మీటర్ల రహదారి వద్దని స్థానిక రైతులు, గ్రామస్థులు కోరారు.
- హనుమంతవాక నుంచి జోడుగుళ్లపాలెం వరకూ ప్రతిపాదిత 100 అడుగుల రహదారిని 60 అడుగులకు పరిమితం చేయాలని స్థానికులు కోరారు.
- అక్కయ్యపాలెం ప్రధాన రహదారి నుంచి రైల్వే న్యూకాలనీ వరకు ప్రతిపాదిత 100 అడుగుల రహదారిని 60 అడుగులకు పరిమితం చేయాలని ఆ ప్రాంత ప్రజలు విన్నవించారు.
- లంకెలపాలెం నుంచి షీలానగర్ వరకు ప్రతిపాదించిన 80 మీటర్ల రహదారి స్థానే 60 మీటర్లు ఉండాలని జీవీఎంసీ కార్పొరేటర్ స్టాలిన్ కోరారు.
- మధురవాడలో వైజాగ్ కన్వెన్షన్ సెంటర్ పక్కనున్న 60 అడుగుల రహదారిని 100 అడుగులకు పెంచాలని ప్రతిపాదించారని, దానిని పునఃపరిశీలన చేయాలని అక్కడి వారు కోరారు.
- సాగర్‌నగర్ దాటిన తరువాత రాడిసన్ బ్లూ హోటల్ వద్ద బీచ్‌రోడ్డును 200 అడుగులకు విస్తరించాలని చూపించారని, అయితే హోటల్‌కు ఇబ్బంది లేకుండా ఇటు వైపు స్థలాలకు నష్టం జరిగేలా రహదారి నిర్మాణం ప్రతిపాదించారని, దానిని మార్చి రోడ్డు మధ్య నుంచి చెరిసగం చేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరారు.
- పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు తన నియోజకవర్గంలో సుమారు 12 రహదారులకు సంబంధించిన అంశాలపై అభ్యంతరాలు, సూచనలు చేశారు.
- విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు హైవేను కలుపుతూ బీచ్‌రోడ్డుకు గంభీరం, యాతపేట, కల్లివానిపాలెం, కోమటిపాలెం మీదుగా రహదారిని విస్తరించాలని కోరారు.
- విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ వన్‌టౌన్‌లో రహదారులను విస్తరించాలని కోరారు.

రోగులకు ఇబ్బంది లేకుండా చర్యలు

... 5వ పేజీ తరువాయి

పాడైన నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా అంటే హీమోడయాలసిస్‌కు బదులుగా అక్యూట్ పెరిటోనియల్ డయాలసిస్ చేయిస్తున్నట్టు వెల్లడించారు. పాడైన మెషీన్ల స్థానంలో కొత్తవి అందుబాటులోకి తీసుకురానున్నట్టు వెల్లడించారు. ఎన్‌టీపీసీ సంస్థ కొత్తగా పది డయాలసిస్ మెషీన్లు అందించేందుకు ముందుకు వచ్చిందన్నారు. రోగులకు ఇబ్బందులు లేకుండా డయాలసిస్ సేవలు అందించేందుకు చర్యలు తీసుకున్నామని వివరించారు.

హైవేలో గ్రేడ్ సెపరేటెడ్ ఫ్లైఓవర్లు?

... 5వ పేజీ తరువాయి

స్పందించారు. ఈ ప్రతిపాదనకు ఆమోదం లభిస్తే నగరంలోని జాతీయ రహదారిపై ఫ్లైఓవర్లు వచ్చే అవకాశం ఉంది. ఇదిలావుండగా గంగవరం పోర్టు నుంచి తుంగ్లాం మీదుగా గాజువాకలో ఎన్‌హెచ్-16ను కలుపుతూ గతంలో ప్రతిపాదించిన ప్రాజెక్టుకు వెంటనే ఆమోదం తెలపాలని కోరారు. గంగవరం పోర్టు నుంచి రోజుకు సుమారు 2,500కు పైగా భారీ వాహనాలు గాజువాక వద్ద జాతీయ రహదారిపైకి వస్తున్నాయని, ట్రాఫిక్ ఇబ్బందిగా మారడంతో పాటు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని వివరించారు. ఈ సమస్య పరిష్కారానికి గతంలో బైపాస్ రహదారిని తుంగ్లాం మీదుగా ప్రతిపాదించారని, వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల అది ఆగిపోయిందని చెప్పారు. రాజకీయాల కారణంగా అభివృద్ధికి ఆటంకం కలగకూడదని, తక్షణమే ఆ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపి పనులు చేపట్టాలని కోరారు. దీనికి కూడా ఆయన సానుకూలంగా స్పందించి డీపీఆర్‌లు పరిశీలించి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్టు తెలిసింది.

వేతనాల కోసం ఎదురుచూపులు

... 5వ పేజీ తరువాయి

జీతం బిల్లు పెట్టేందుకు ఇబ్బంది లేదు. కొత్తగా కేటాయించిన పోస్టుల్లోకి వచ్చిన వారికి మాత్రమే జీతం కోసం పొజిషన్ ఐడీ రావాల్సి ఉంటుంది. దీనిని కొన్ని మండలాల విద్యాశాఖాధికారులు పరిగణనలోకి తీసుకోకపోవడంతో జూన్ నెల జీతం బిల్లు పెట్టలేకపోయారు. ఒక నెల జీతం నిలిచిపోతే తరువాత నెల రెగ్యులర్ జీతాల బిల్లులతో పెట్టేందుకు వీలులేదు. ఆగస్టు నెల తొలివారంలో సప్లమెంటరీ బిల్లుల అప్‌లోడ్ సమయంలోనే తిరిగి బిల్లు పెట్టాలి. అంటే అందరికీ పొజిషన్ ఐడీలు వచ్చి ఆగస్టు తొలి వారంలో సప్లిమెంటరీ బిల్లుగా అప్‌లోడ్ చేస్తే సెప్టెంబరు 1న జూన్, జూలై నెల జీతాలు వస్తాయని టీచర్లు వ్యాఖ్యానిస్తున్నారు. విద్యా శాఖ, ఖజానా శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో జీతాలు సకాలంలో అందుకోలేని పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ కొనసాగింపుపై సందిగ్ధం

... 5వ పేజీ తరువాయి

దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 13 వరకూ అవకాశం ఇచ్చారు. బుధవారం నుంచి 16న ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని షెడ్యూల్‌లో ప్రకటించారు. కానీ, బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించలేదు. ఈ విషయంలో ఉన్నతాధికారులు ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి. ప్రస్తుతానికి అతిథి అధ్యాపకులు వర్సిటీలోని అధికారులను కలిసి తమ ఇబ్బందులను తెలియజేస్తున్నారు.

ఒడిశాలో బర్డ్‌ఫ్లూ

... 5వ పేజీ తరువాయి

ఒడిశాలో బర్డ్‌ఫ్లూ రావడంతో విశాఖలో బ్యాగ్ ప్రతినిధులు ప్రధానంగా కోళ్ల వ్యాపారులు అప్రమత్తమై రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందించారు. దీనిలో భాగంగా బుధవారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కలిసి సమస్య వివరించారు. ఆయన వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు ఫోన్ చేసి ఒడిశాలో బర్డ్‌ఫ్లూ వచ్చిన విషయాన్ని తెలియజేశారు. బర్డ్‌ఫ్లూ తగ్గేంత వరకూ ఒడిశా నుంచి కోళ్ల దిగుమతి పూర్తిగా నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని గంటా కోరారు. సరిహద్దులో నిఘా పెట్టేలా శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని సూచించారు.

కేంద్ర రక్షణ శాఖ మంత్రి పర్యటన రద్దు

విశాఖపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ విశాఖపట్నం పర్యటన రద్దయినట్టు అధికార వర్గాలు ప్రకటించాయి. ఆయన ఈనెల 17న సాయంత్రం ఇక్కడికి వచ్చి, 18వ తేదీన కొత్త నేవీ నౌక 'ఐఎన్‌ఎస్ నిస్తార్'ను ప్రారంభించాల్సి ఉంది. అనివార్య కారణాల వల్ల మంత్రి పర్యటన రద్దయిందని జిల్లా అధికార వర్గాలు తెలిపాయి.

నేడు రక్షణ శాఖ సహాయ మంత్రి రాక

విశాఖపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ గురువారం సాయంత్రం విశాఖపట్నం వస్తున్నారు. విమానాశ్రయం నుంచి నేవల్ డాక్‌యార్డుకు వెళ్లి అక్కడి అతిథిగృహంలో విశ్రాంతి తీసుకుంటారు. మరుసటిరోజు డాక్ యార్డ్‌లో తూర్పు నౌకాదళం నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొంటారు.

భూ సేకరణకు సహకరించండి

గాజువాక, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైలు ప్రాజెక్టు నిమిత్తం భూ సేకరణకు ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించవలసిందిగా మెట్రో ప్రాజెక్ట్ ఎస్డీసీ సుధాసాగర్ కోరారు. గాజువాక జోనల్ కార్యాలయంలో బుధవారం మెట్రో ప్రాజెక్టు నిర్మాణంపై ఆయా ప్రాంతాల ప్రజల నుంచి భూ సేకరణపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూర్మన్నపాలెం,వడ్లపూడి, శ్రీనగర్, చినగంట్యాడ, పాత గాజువాక, పంతులుగారి మేడ, ఆటోనగర్ జంక్షన్, బీహెచ్‌పీవీ, అక్కిరెడ్డిపాలెం, షీలానగర్ ప్రాంతాల్లో జాతీయ రహదారికి ఆనుకుని భూ సేకరణ చేపట్టాల్సి ఉందన్నారు. కూర్మన్నపాలెం నుంచి షీలానగర్ వరకు సుమారు 312 వరకు వ్యాపార సంస్థలు, గృహాలు,ఖాళీ స్థలాలను సేకరించనున్నామని, ఎవరి స్థలాలను ప్రాజెక్టు కోసం సేకరిస్తామో వారికి ఆర్‌ఆర్ ప్యాకేజీ, నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పారు.

జిమ్నాస్టిక్స్ శిక్షణ కేంద్రం కొనసాగించాలి

» వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ వ్యవస్థాపకులు కె.రమాప్రభ

మద్దిలపాలెం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : పాండురంగాపురం ఇండోర్ స్టేడియంలోని జిమ్నాస్టిక్స్ స్పెషల్ బెడ్ శిక్షణ సౌకర్యాన్ని మల్టీస్పోర్ట్ కాంప్లెక్స్‌గా మార్చాలనే ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ వ్యవస్థాపకులు కె.రమాప్రభ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. నగరంలో రెండు దశాబ్దాలుగా పిల్లల శారీరక అభివృద్ధికి కేంద్ర బిందువుగా నిలిచిన జిమ్నాస్టిక్స్ సెంటర్‌ను కొనసాగించాలన్న తల్లిదండ్రుల డిమాండ్‌కుతమ పూర్తి మద్దతు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ జిమ్నాస్టిక్ కేంద్రం అనేక మంది చిన్నారులకు శిక్షణిచ్చి జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయికి అథ్లెట్లను తయారు చేసిందన్నారు. ఇటువంటి ప్రత్యేకమైన క్రీడల కోసం ఉన్న సెంటర్‌ను స్పోర్ట్స్ కాంప్లెక్స్‌గా మార్చడం ద్వారా ప్రాధాన్యత కుంటుపడుతుందని తెలిపారు. నగరంలోని ప్రభుత్వ స్థలాల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు నిర్మాణం చేసి వాటిని ప్రభుత్వమే నిర్వహించి ఉచితంగా అన్ని రకాల క్రీడల్లో శిక్షణ ఇవ్వడం ద్వారా వేలాదిమంది క్రీడాకారులు తయారవుతారని పేర్కొన్నారు. పాండురంగాపురంలో జిమ్నాస్టిక్ కేంద్రాన్ని యథావిధిగా కొనసాగించాలని కోరారు.

తోటగరువు జడ్పీ ఉన్నత పాఠశాలలో 360 మంది చేరిక

ఆరిలోవ, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఈ విద్యాసంవత్సరానికి తోట గరువు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సుమారు 360 మంది విద్యార్థులు ప్రవేశం పొందినట్టు ప్రధానోపాధ్యాయురాలు గరి మెళ్ల దుర్గాభవానీ తెలిపారు. ప్రస్తుతానికి 1325 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. గత సంవత్సరం 1415 మంది విద్యార్థులు ఉండేవారని, ఈ ఏడాది కూడా ఆదే సంఖ్యకు చేరుకుంటామనివిశ్వాసం వ్యక్తంచేశారు. మధ్యాహ్న భోజనాలను సుమారు 900 మంది విద్యార్థులు తింటున్నట్టు ఆమె తెలిపారు.

ఇప్పటికీ పూర్తి కాని షూస్ పంపిణీ

ఆరిలోవ, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : కొన్ని పాఠశాలలకు షూస్ పంపిణీ చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తోటగరువు పాఠశాల విద్యార్థులకు ఇప్పటి వరకూ షూస్ అందించకపోవడంతో వారు మైదానంలో కొందరు చెప్పులు, మరి కొందరు కాళ్లకు ఏమీ లేకుండా ఆటలు ఆడుతున్నారు.

త్వరలోనే అందజేస్తాం : ఎంఈవో అనూరాధ

ఈ విషయమై మండల విద్యాశాఖాధికారి అనూరాధను అడగ్గా.. మండల పరిధిలో గల 63 స్కూళ్ల విద్యార్థులకు సుమారు 12 వేల 470 షూలు వచ్చాయని తెలిపారు. వాటిని కొలతల ప్రకారం కేటాయించి ఆయా పాఠశాలల విద్యార్థులకు అందిస్తామని తెలిపారు. ఈ క్రమంలో ఆమె తోటగరువు స్కూలులో గల గోడౌన్‌కు వచ్చి షూస్‌ను పరిశీలించారు. మండలంలో 40 ప్రాథమిక పాఠశాలలు, ఒక అప్పర్ ప్రైమరీ స్కూలు, 12 ఉన్నత పాఠశాలలకు ఈ షూస్‌లను అందించనున్నట్టు తెలిపారు.

సినిమా గైడ్

- **తమ్ముడు** : మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)
- **జురాసిక్ వరల్డ్** : జగదాంబ, రమాదేవి
- **కన్నప్ప** : జగదాంబ, కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ),
- **కుబేర** : సంగం, ఊర్వశి (కంచరపాలెం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఎఫ్.1** : రమాదేవి, జగదాంబ,
- **మార్గన్** : శారద, శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 30, వంకాయలు (తెలుపు) 88, వంకాయలు (నలుపు)40, బెండకాయలు 26, పచ్చిమిర్చి 76, కాకరకాయలు 38, బీరకాయలు 34, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 20, క్యారెట్ 44, దొండకాయలు 30, బంగాళాదుంపలు 17, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 46, అల్లం (పాతది) 48, బరబాటి 24, అగాకార కాయ 75, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 42, బద్దచిక్కుడు 50, దోస కాయలు 18,వెల్లుల్లి (పెద్దవి) 85, కొబ్బరికాయ (పెద్దది) 30, బీట్‌రూట్ 35, పోటల్స్ 42, బీన్స్ (పెన్సిల్) 100, కీరదోస 34, కాప్సికమ్ 86, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 38, కంద 50, గ్రీన్ బటానీ 80, దేముడుచిక్కుడు84, గోరు చిక్కుడు 40, కూర పెండలం 30, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర(పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, క్రపెండలం 24, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	73
లైవ్ ధర	93
విత్ స్కిన్	156
స్కిన్‌లెస్	166

హెల్త్ సిటీలో దుర్గంధం

» ప్రధాన కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం
» నెలల తరబడి తొలగించని పారిశుధ్య సిబ్బంది
» దోమల వ్యాప్తితో స్థానికుల భయాందోళనలు



కాలువలో నిల్వగా ఉన్న చెత్తాచెదారం



నిర్వహణ లేక కాలువలో పెరిగిన పిచ్చి మొక్కలు



కాలువకు అనుకొని ఉన్న పొదలు

ఆరిలోవ, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ హెల్త్ సిటీలో గల పినాకిల్ వైద్యశాలకు అనుకొని ఉన్న ప్రధాన కాలువ పూర్తిగా చెత్తాచెదారాలతో నిండిపోయింది. దీంతో ఇక్కడ ఉన్న మదుం నుంచి నీరు ప్రవహించడానికి అవకాశం లేకుండా పోయింది. ఫలితంగా వాడుక నీరు అంతా ఇక్కడే నిలువ అవుతోంది, దీనివల్ల ఇక్కడ దోమలు వృద్ధి చెందుతున్నాయి. తీవ్ర దుర్వాసన వెదజల్లుతోందని, ఇటు వైపు నుంచి నడిచి వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉంటోందని పాదచారులు, స్థానికులు వాపోతున్నారు. ఈ మదుంకు ఆనుకొని తోపుడు బండ్ల వ్యాపారాలు సాగిస్తుంటారు. ఆ బండ్లపై భోజనాలు, ఇతర ఆహార పదార్థాలు, పండ్లు వంటివి విక్రయిస్తుంటారు. ఎక్కువగా ఆస్పత్రులను వచ్చే వారికి ఈ తోపుడు బండ్లపై అమ్మే పదార్థాలే దిక్కు. అయితే ఎలాంటి శుభ్రత లేని ఆహార పదార్థాలు రోగులు తినడం వల్ల అనర్థం జరిగే ప్రమాదం ఉంది. రోగుల బంధువుల కూడా చాలామంది ఈ తోపుడుబండ్ల వద్దే తింటుంటారు. ఆస్పత్రుల సమీపంలో ఉండడం, ధర కూడ తక్కువగా ఉండడంతో మధ్య, దిగువ తరగతి వర్గాల వారు ఇక్కడే తింటుంటారు. అయితే పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో వీరంతా ఇబ్బంది పడుతున్నారు.

అధికారుల తీరుపై అసంతృప్తి

జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది మాత్రం ఇక్కడ ప్రధాన కాలువ దుస్థితిని పట్టించుకోవడం లేదని స్థానికులు, ఆస్పత్రులకు వచ్చే వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాలువ గోడలు కూడా కూలిపోయి ఉండడంతో మురుగు ప్రవహించని పరిస్థితి. దీనికితోడు ఆ పరిసరాలు పొదలతో నిండి ఉంటాయి. దీంతో విష పురుగులు, పాములు వంటివి కాలువలో నివాసం ఏర్పరచుకునే ప్రమాదం కూడా ఉందని అంటున్నారు. కాబట్టి జీవీఎంసీ పారిశుధ్య విభాగం, పట్టణ ప్రణాళిక శాఖ అధికారులు ఇప్పటికైనా ఇక్కడి పరిస్థితిని గమనించి, సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఫార్మసీ విద్యార్థులకు అధునాతన వాష్ రూమ్స్

» ఏయూ పూర్వ విద్యార్థి డాక్టర్ దేవా హెచ్ పురాణం దాతృత్వం



విద్యార్థినులతో ప్రిన్సిపాల్ ఆచార్య జి.గిరిజాశంకర్

వెంకోజీపాలెం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఏయూ ఫార్మసీ కళాశాల విద్యార్థినులకు అధునాతన వాష్ రూమ్స్ సమకూరాయి. ఫార్మసీ కళాశాల భవనంలో నూతనంగా నిర్మించిన వాష్ రూమ్స్ విద్యార్థులకు బుధవారం అందుబాటులోకి తీసుకొచ్చారు. ఏయూ సైన్స్ కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ దేవా హెచ్ పురాణం తన సొంత నిధులతో తాను చదువుకున్న ఏయూకు సహాయాన్ని అందిస్తూ వీటిని నిర్మించారు. తన సొంత నిధులు దాదాపు రూ.15 లక్షలు వెచ్చించి అధునాతన రీతిలో వీటిని నిర్మించి ఫార్మసీ కళాశాలకు అందజేశారు. తన తల్లిదండ్రులు లలితాదేవి పురాణం, కోటిలింగాల మూర్తి పురాణం పేరు మీదుగా వర్సిటీలో నిరంతరం విద్యార్థినులకు ఉపయుక్తంగా అనేక కార్యక్రమాలను దేవా పురాణం నిర్వహిస్తున్నారు. గతంలో ఫార్మసీ కళాశాల విద్యార్థులకు హాస్టల్ వసతి లేదనే విషయాన్ని తెలుసుకొని విద్యార్థులకు ఒక అధునాతన హాస్టల్ నిర్మించి అందించారు. అనంతరం రసాయన శాస్త్ర విభాగ సమావేశం మందిరాన్ని ఆదునీకరించి విద్యార్థులకు ఉపయోగంగా తీర్చిదిద్దారు. అమెరికాలో నివసిస్తున్నప్పటికీ భారతదేశం వచ్చిన ప్రతిసారి ఏయూను సందర్శిస్తూ, ఇక్కడ అధికారులతో మాట్లాడి విశ్వవిద్యాలయ అవసరాలను తెలుసుకుని భవనాలు, ప్రయోగశాలలో యంత్ర పరికరాలు అందిస్తున్నారు.



కొత్తగా నిర్మించిన మరుగుదొడ్లు

తాజాగా విద్యార్థినులకు అవసరమైన వాష్ రూమ్స్ నిర్మాణం చేసి అందించారు. ప్రత్యేకంగా ఒక ఆర్కిటెక్ట్‌ను నియమించి వారు సూచించిన విధంగా కార్పొరేట్ హోటల్స్, విమానాశ్రయాల్లో తరహాలో వాష్ రూమ్స్ నిర్మాణం చేపట్టి విద్యార్థినులకు ఉపయుక్తంగా తీర్చిదిద్దారు. తన ఉన్నతికి కారణమైన ఏయూకు తన వంతు సహకారాన్ని నిరంతరం అందిస్తున్న దేవా పురాణం ఫార్మసీ కళాశాలకు, విద్యార్థినులకు ఉపయుక్తంగా నిలిచే విధంగా వీటిని తన సొంత నిధులతో నిర్మాణం చేసి అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య జి.గిరిజాశంకర్‌తో పాటు విభాగాచార్యులు వి.గిరిజాశాస్త్రి, ఏకేఎం పవార్ ఆచార్య కె.ఈశ్వర్‌కుమార్, ఆచార్య పి.శైలజ, బీఫార్మసీ, ఎంఫార్మసీ విద్యార్థినులు పాల్గొన్నారు.

కోస్టల్ టూరిజంపై అతిథి ఉపన్యాసం



యోగేష్ చంద్రలాల్ షాను సత్కరిస్తున్న అధ్యాపకులు

వెంకోజీపాలెం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఏయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో బుధవారం కోస్టల్ టూరిజంపై అతిథి ఉపన్యాసాన్ని పీటర్ డక్కర్ స్మార్ట్ సెమినార్ హాలులో నిర్వహించారు. ఇండియన్ మేరీ టైం యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ కెప్టెన్ యోగేష్ చంద్రలాల్ షా హాజరై ఆంధ్రప్రదేశ్‌లో 13 పెద్ద నదులు ఉన్నాయని, ఈ నదులను సముద్రానికి అనుసంధానం చేస్తూ రవాణా వ్యవస్థను ఏర్పాటు చేసి టూరిజాన్ని అభివృద్ధి చేసుకుంటే గ్రామాలు, రహదారులు, రవాణా, మౌలిక సదుపాయాలు అవకాశాలు మెరుగుపడతాయని తెలియజేశారు. అనంతరం హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ జాలాది రవి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య, రిసోర్స్ పర్సన్ కెప్టెన్ యోగేష్ చంద్రలాల్ షాను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురు చూడక...

» డ్రైనేజీలో పూడిక తొలగించిన మహిళ



డ్రైనేజీలో పూడికతీతకు సిద్ధమైన స్థానిక మహిళ

మద్దిలపాలెం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 23వ వార్డు చైతన్యనగర్‌లో డ్రైనేజీల్లో పూడికలు తొలిగించేందుకు ఓ మహిళా పారపట్టింది. ఇళ్ల ముందు పేరుకుపోయిన పూడికలను తీసింది. నిల్వ ఉన్న మురుగు నీటి ప్రవాహానికి అడ్డు తొలగించింది. వార్డులో పారిశుధ్య కార్మికులున్నా తరచూ స్థానికులు తమ ఇళ్ల ముందు పూడికలు తీసుకోవడం పరిపాటే. ఇక్కడ పెద్ద డ్రైనేజీలు లేవు. ఇంటి ముందు మురుగు నీరు వెళ్లేందుకు చిన్న డ్రైనేజీలు మాత్రమే ఉన్నాయి. సందుల్లో కూడా అడుగు కూడా ఉండని కాల్వలు ఉన్నాయి. అయితే పారిశుధ్య సిబ్బంది పెద్ద డ్రైనేజీల్లో పూడికలు మాత్రమే తీస్తూ చిన్న డ్రైనేజీలను విడిచి పెట్టేస్తున్నారు. ఒకవేళ స్థానికులు డ్రైనేజీలు క్లీన్ చేయాలని వారిని కోరితే డబ్బులు ఇస్తేనే కాని పనిచేయమని చెబుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. అందుకే ఎవరి ఇంటి ముందు వారు ఇలా క్లీన్ చేసుకుంటున్నారు

అండర్ డ్రైనేజీ లీకేజీతో రోడ్డు అధ్వానం



ముత్తూట్ ఫైనాన్స్ రోడ్డులో లీకవుతున్న అండర్ డ్రైనేజీ మురుగు నీరు

మద్దిలపాలెం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 22వ వార్డు పిఠాపురం కాలనీ ముత్తూట్ ఫైనాన్స్ రోడ్డులో అండర్ డ్రైనేజీ మ్యాన్‌హోల్ లీకేజీ కావడంతో మురుగు నీరు రోడ్డు మీదకు ప్రవహిస్తోంది. ఈ రోడ్డులో యూజీడీ లైన్‌కు పైన ఓ భవనం నిర్వాహకులు పలకలు వేయడంతో అండర్ డ్రైనేజీ మురుగు నీరు కాలువలో కలవకుండా రోడ్డు మీదకు వచ్చేస్తోంది. దీంతో రహదారి మొత్తం మురుగు నీటితో నిండిపోయింది. దుర్వాసన వెదజల్లుతోంది. తీవ్ర దుర్గంధంతో స్థానికులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే మరమ్మతు చేయాలంటి కోరుతున్నారు.

స్మార్ట్ మీటర్లపై సీపీఐ నిరసన



ఆందోళన నిర్వహిస్తున్న సీపీఐ నేతలు

ఆరిలోవ, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలని సీపీఐ నేతలు, కార్యకర్తలు పెదగదిలి జంక్షన్‌లో బుధవారం ర్యాలీ నిర్వహించి కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ రెహమాన్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగించడం కోసం గత వైసీపీ ప్రభుత్వం అదాని కంపెనీతో చేసుకున్న ఒప్పందం వల్ల రాష్ట్ర ప్రజలపై 25 సంవత్సరాల పాటు రూ.1.10 వేల కోట్ల భారం పడిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ ఒప్పందం రద్దు చేస్తామని చెప్పి, సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై మోపుతున్న విద్యుత్ భారాలను రద్దు చేస్తామని ఎన్నికల ముందు హామీలు ఇచ్చారని, తీరా అధికారంలోకి వచ్చి ఏడాది ముగిసినా ఆ హామీలు మాత్రం అమలు చేయలేదని విమర్శించారు. పైగా విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై 15 వేల 435 కోట్ల రూపాయలు అదనంగా భారం మోపారన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు విద్యుత్ చార్జీల పెంపును తీవ్రంగా వ్యతిరేకించారని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకోవాలని, అవసరమైతే పగులు గొట్టాలని పిలుపునిచ్చారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వారే చర్యలు తీసుకుంటున్నారన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల వినియోగదారులకు అదనపు ఆర్థిక భారం పడుతుందని, అందుకే వీటి ఏర్పాటును అందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిలా సమితి సభ్యులు ఎ.దేవుడమ్మ, సీహెచ్ కాసు బాబు, ఆరిలోవ ప్రాంత కార్యదర్శి కె.లక్ష్మణ రావు, ఎ.రవి, సందీప్, బి.రాజురమణ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న జీపు



మద్దిలపాలెం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధి సిరిపురం జంక్షన్‌లో ఓ జీపు డివైడర్‌కు బలంగా ఢీకొంది. బీచ్ నుంచి సిరిపురం వైపు వస్తున్న జీపు వీఎంఆర్డీఏ భవనం ఎదురుగా వచ్చేసరికి అదుపు తప్పి డివైడర్‌ను బలంగా ఢీకొంది. దీంతో డివైడర్లు పక్కకు ఒరిగిపోయాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏ ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. మూడో పట్టణ ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

కూటమి వల్లే అభివృద్ధి సాధ్యం

» ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



ఎమ్మెల్యే రామకృష్ణబాబుకు స్వాగతం పలుకుతున్న మహిళలు

విశాలాక్షినగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. జీవీఎంసీ 9వ వార్డు పరిధిలోని హనుమంతవాక రామాలయం వీధిలో బుధవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులున్నా ఎన్నికల హామీలను నెరవేర్చడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట తప్పడం లేదన్నారు. తల్లికి వందనం, సామాజిక పెన్షను, ఫీజురీ-యింబర్స్‌మెంట్ తదితర పథకాలను పక్కాగా అమలు చేస్తున్నారన్నారు. వచ్చే నెల నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు చేస్తున్నట్టు చెప్పారు. కేవలం సంక్షేమానికే పరిమితం కాకుండా అభివృద్ధి పనులు కూడా చేపడుతున్నట్టు పేర్కొన్నారు.కార్యక్రమంలో కూటమి నాయకులు అక్కరబోయిన రాంబాబు, బుడుమూరి గోవింద్, వేజెళ్ల సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



గీతాలు ఆలపిస్తున్న విద్యార్థులు

మద్దిలపాలెం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో సీపీఈ జూనియర్ కళాశాల 19వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. 850 మంది విద్యార్థులు పాటలు, నృత్యాలు, మ్యూజిక్ బ్యాండ్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు సెల్ ఫోన్‌కు బానిసైతే ఎటువంటి పరిస్థితులు వస్తాయో వివరిస్తు చేసిన నాటకం సందేశాత్మకంగా నిలిచింది. అనంతరం అఖిల భారత ర్యాంకులు సాధించిన సీఏ, సీఎంఏ విద్యార్థులకు ప్రిన్సిపాల్ బి.ఆదినారాయణ చేతుల మీదుగా నగదు బహుమతులు ప్రదానం చేశారు. ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సుపరిపాలనలో ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి చర్యలు

» ఎమ్మెల్యే వెలగపూడి ఆదేశాలతో అధికారులు క్షేత్ర పర్యటన



గణబాబునగర్‌లో గల డెయిరీ ఫారం వద్ద ఖాళీ స్థలం పరిశీలిస్తున్న పశు సంవర్ధక శాఖ అధికారులు

ఆరిలోవ, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : సుపరిపాలన తొలి అడుగులో భాగంగా ఈ నెల 8న 12వ వార్డు గణబాబునగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో స్థానికులు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు దృష్టి సారించారు. ఆ కార్యక్రమంలో భాగంగా పలువురు మహిళలు.. స్థానిక డెయిరీ ఫారం ఖాళీ స్థలంలో అల్లరి మూకలు చేరి ఇబ్బందికలుగజేస్తున్నారంటూ ఫిర్యాదు చేశారు. గంజాయి, మద్యం తాగుతూ ఆకతాయి చేష్టలకు పాల్పడుతున్నారంటూ పేర్కొన్నారు.

ఈ క్రమంలో బుధవారం పశుసంవర్ధక శాఖ డీడీ నీలయ్యం, జేడీ కరుణాకరరావు, డీఈ వెంకటరావు తదితరులు డెయిరీ స్థలాన్ని పరిశీలించారు. కంచె ఏర్పాటు చేసేందుకు అవసరమైన ఏర్పాట్ల గురించి చర్చించారు. త్వరలో సమస్య పరిష్కారం అయ్యే సూచనలు కనిపించడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అర్ధనూట పదహార్లు పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న ఆచార్య బాలమోహన్ దాస్ తదితరులు

సీతంపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పౌరగ్రంథాలయంలో స్వరరాగ సుధ లలిత భక్తిగీతాల సంస్థ ఆధ్వర్యంలో రచయిత తాళభక్తుల లక్ష్మీప్రసాద్ రచించిన 'అర్ధనూట పదహార్లు' పుస్తకావిష్కరణ బుధవారం నిర్వహించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ, గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య బాలమోహన్‌దాస్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని సాహిత్య వాచస్పతి వక్తలు డాక్టర్ దామెర వెంకట సూర్యారావు సమీక్షించారు. మేడా బుజమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ కొచ్చెర్లకోట వెంకటసత్యనారాయణ, పద్యకవి చిన్న సూరి, కవి లక్ష్మీప్రసాద్, స్వరరాగ సుధ సంస్థ అధినేత పీవీ పద్మిని పాల్గొన్నారు.

ఈ ద్విచక్ర వాహనం ఎవరిదో?



ఐదు రోజులుగా ఇదే స్థలంలో నిలిపి ఉన్న వాహనం

ఆరిలోవ, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : దీనదయాళ్‌పురం ప్రాథమిక పాఠశాల సమీపంలో గల సర్వీసు రోడ్డులో ఒక ద్విచక్ర వాహనాన్ని సుమారు ఐదు రోజుల నుంచి ఎవరో పార్కింగ్ చేసి ఉన్నారు.ఈ వాహనం ఎవరిదో? ఎందుకు ఇక్కడ నిలిపి ఉన్నారో తెలియడం లేదని స్థానికులు చెబుతున్నారు. పోలీసు అధికారులు దృష్టి సారించి వాహనాన్ని స్వాధీనం చేసుకోవాలని స్థానికులు, మార్నింగ్ వాక్ చేస్తున్న వాకర్లు కోరుతున్నారు.

ఇబ్బందుల నడుమ విద్యార్థుల భోజనం

- చిత్తడి నేలపై కూర్చుని తినడానికి అవస్థలు పడుతున్న విద్యార్థులు
- ప్రమాదకరంగా మోటార్ పంపు

డాబాగార్డెన్స్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 31వ వార్డులో రమాదేవి భానోజీరావు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇబ్బందుల మధ్య భోజనం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. తమ పిల్లలకు భోజనం తినిపించేందుకు వచ్చే తల్లిదండ్రులు కూడా పాఠశాలలో చిత్తడి నేల మీద కూర్చొనే అన్నం తినిపించే పరిస్థితి ఏర్పడింది. ఇటీవల కాలంలో పాఠశాలలో సరైన నిర్వాహణ లేకపోవడంతో కొత్త విద్యార్థులు జాయిన్ అయ్యే విషయంలో కూడా సరిగ్గా సమాధానాలు చెప్పడం లేదని తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలను అప్‌గ్రేడ్ చేసినప్పటికీ నిర్వాహణలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారని కొందరు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కనీసం భోజనం చేసేందుకు సరైన ప్రదేశాన్ని కల్పించకపోవడంతో విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా కొంత మంది విద్యార్థులు స్కూల్ ఆవరణలోని మోటార్స్ పంపులోకి దిగి ఆడుకోవడం గమనార్హం. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు విద్యార్థులు భోజనం చేసేందుకు సరైన స్థలం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


తరగతి గుమ్మం దగ్గర భోజనం పెడుతున్న తల్లులు


చిత్తడిగా మారిన భోజనశాల

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: సీపీ


సమావేశంలో ప్రతిజ్ఞ చేస్తున్న నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి

సీతమ్మధార, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మత్తు పదార్థలకు దూరంగా ఉండాలని నగర కమిషనర్ శంకబ్రత బాగ్చి పేర్కొన్నారు. డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో 'నవ సమాజ నిర్మాణం, రేపటి భారతదేశానికి విప్లవాత్మక మేల్కొలుపు' అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ తీసుకున్నవారి జీవితాలు నాశనమవుతున్నాయని అన్నారు. వ్యసనాలకు బానిసలై తల్లిదండ్రులకు క్షోభ మిగల్చవద్దని, లక్ష్యం పెట్టుకుని ఆ దిశగా ముందుకు సాగాలని ఆయన సూచించారు. మహిళలపై హింస, ట్రాఫిక్ క్రమశిక్షణ రాహిత్యానికి వ్యతిరేకంగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు, కళాశాల యాజమాన్యంతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. యువత మంచి వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి జనసేనలో చేరిక


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

సీతంపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 39వ వార్డుకు చెందిన పలువురు వైసీపీ నాయకులు ఎమ్మెల్యే వంశీ కృష్ణ అధ్వర్యంలో జనసేన పార్టీలో బుధవారం చేరారు. ఈ సందర్భంగా స్థానిక జనసేన కార్యాలయంలో వాళ్లకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

'అర్ధనూట పదహార్లు' పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణ చేస్తున్న ఆచార్య బాలమోహన్ దాస్ తదితరులు

సీతంపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పౌరగ్రంథాలయంలో స్వరరాగ సుధ లలిత భక్తిగీతాల సంస్థ ఆధ్వర్యంలో రచయిత తాళభక్తుల లక్ష్మీప్రసాద్ రచించిన 'అర్ధనూట పదహార్లు' పుస్తకావిష్కరణ బుధవారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ, గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య బాల మోహన్‌దాస్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని సాహిత్య వాచస్పతి వక్తలు డాక్టర్ దామెర వెంకట సూర్యారావు సమీక్షించారు. మేడా బుజమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ కొచ్చెర్ల కోట వెంకట సత్యనారాయణ, పద్యకవి చిన్న సూరి, కవి లక్ష్మీప్రసాద్, స్వరరాగ సుధ సంస్థ అధినేత పీవీ పద్మిని పాల్గొన్నారు.

చురుగ్గా కొత్త సచివాలయాల భవన నిర్మాణం


అంబేడ్కర్ కాలనీలో స్లాబ్ దశలో ఉన్న సచివాలయ భవనం

మురళీనగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటైన సచివాలయాలు ఇప్పటికీ చాలా చోట్ల అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. కొన్ని చోట్ల సొంత భవనాలు లేక అద్దె భవనాల్లోనే కొనసాగిస్తున్నారు. సచివాలయాల్లో పనిచేసే వాతావరణం ఎక్కడా కనిపించదు. పనుల కోసం వచ్చే ప్రజలు కూర్చోవ డానికి కూడా కుర్చీలు ఉండవు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత సొంత భవనాలు కట్టుకునేందుకు అనుమతులిచ్చింది. దీనిలో భాగంగా విశాఖ ఉత్తరంలోని 51వ వార్డు అంబేడ్కర్ కాలనీ మెయిన్ రోడ్‌లోని ప్రభుత్వ స్థలంలో రూ.19 లక్షల వ్యయంతో కొత్త సచివాలయ భవన నిర్మాణం జోరుగా సాగుతోంది. త్వరలోనే ఇది అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం స్లాబు దశలో ఉంది. తదుపరి గదుల ఏర్పాటు ఏర్పాటు, ఎలక్ట్రికల్ పను లు, ప్లంబింగ్ పనులు పూర్తయిన తరువాత కొత్త సచివాలయ భవ నం అందుబాటులోకి వస్తుంది. నిర్మాణం పూ ర్తయిన తరువాత అద్దె భవనాల నుంచి సొంత భవనాలకు మార్చడానికి అధికారులు నిర్ణయం తీ సుకున్నారు. నూతన సచివాలయ భవన నిర్మాణంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సర్కార్ బడిలోనే చదువుతాం

ప్రభుత్వ పాఠశాలలకు క్యూ కడుతున్న విద్యార్థులు


వివిధ ప్రైవేటు పాఠశాలల నుంచి చేరిన విద్యార్థులు


కంచరపాలెం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు క్యూ కడుతున్నారు. కంచరపాలెం, ఆర్పీపేట ఉన్నత పాఠశాల, తిక్కవానిపాలెం, కప్పరాడ, బర్మాకాలనీ, మాధవధార తదితర ప్రాంతాల్లోని ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు టీసీలు తీసుకుని ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. సర్కారు బడుల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో, నాణ్యమైన బోధన ఉంటుందని తల్లిదండ్రులు అంటున్నారు. విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ కిట్లను, మధ్యాహ్న భోజన పథకం కింద నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించడం ఆనందమని పలువురు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది ప్రవేశాలు రెట్టింపు అవ్వడంతో ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బినామీలపై 6ఎ కేసులు: డీఎస్‌వో భాస్కర్‌రావు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కంచరపాలెం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాలలో బినామీ డీలర్లు ఉన్నట్లయితే 6ఎ కేసులు పెట్టి డీలర్‌షిప్పులు రద్దు చేస్తామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వి.భాస్కర్‌రావు స్పష్టంచేశారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'బినామీల చేతుల్లో రేషన్ డిపోలు' శీర్షికన ప్రచురించిన కథనానికి డీఎస్‌వో వివరణ ఇచ్చారు. జిల్లాలో 642 చౌకదుకాణాల నుంచి 5,24,989 రైస్ కార్డుల ద్వారా ప్రభుత్వం పేదలకు బియ్యం, పంచదార తదితర సరుకులను నెలవారీ పంపిణీ చేస్తోందన్నారు. జిల్లాలో మూడు అర్బన్ మండలాలు, నాలుగు రూరల్ మండలాల పరిధిలోని 642 చౌకదుకాణాల్లో 556 డిపోలు అధీకృత డీలర్లు, మిగిలినవి స్వయం సహాయక సంఘాల ద్వారా నడుస్తున్నట్లు తెలిపారు. జూలై నెలకు సంబంధించి ఇప్పటికే సుమారు 95% సరుకుల పంపిణీ జరిగిందన్నారు. రేషన్ దుకాణాలను తనిఖీ ఇన్‌స్పెక్టర్లు స్వయంగా పరిశీలించి డీలర్ల ఫొటోలు తదితర పూర్తిసమాచారాన్ని డీఎస్‌వో కార్యాలయ రికార్డుల్లో నమోదు చేసి ఈపోస్ యంత్రాల్లో నవీకరించినట్లు పేర్కొన్నారు. కొన్ని డిపోలను తనిఖీ చేసి 6ఎ కేసులు కూడా నమోదు చేసినట్లు తెలిపారు. డిపోలు, డీలర్లపై ప్రత్యేకమైన ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటామని భాస్కర్‌రావు స్పష్టంచేశారు.

సింహగిరిపై కర్కాటక సంక్రమణ తిరువీధి


తిరువీధిలో స్వామివారు

సింహాచలం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : కర్కాటక సంక్రమణ పుణ్య దినాన్ని పురస్కరించుకుని సింహగిరిపై అప్పన్న స్వామి తిరువీధి బుధవారం వైభవంగా నిర్వహించారు. రాత్రి ఆరాధనకు ముందు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులను శోభాయమానంగా అలంకరించి పల్లకిలో అధిష్ఠింపజేశారు. పండితుల వేదమంత్రోచ్చారణలు, విద్వాంసుల నాదస్వరాలపనలు నడుమ నాలుగు మాడవీధుల్లో తిరువీధి ఉత్సవం జరిపారు. మార్గం పొడవునా భక్తులు కర్పూర నీరాజనాలతో స్వామివారిని ఆహ్వానించారు. అనంతరం రాత్రి ఆరాధన, పవళింపు సేవ జరిపి ఆలయ కవాట బంధనం చేశారు.

కోస్టల్ టూరిజంపై అతిథి ఉపన్యాసం


యోగేష్ చంద్రలాల్ షాను సత్కరిస్తున్న అధ్యాపకులు

వెంకోజీపాలెం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఏయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో బుధవారం కోస్టల్ టూరిజంపై అతిథి ఉపన్యాసాన్ని పీటర్ డక్కర్ స్మార్ట్ సెమినార్ హాలులో నిర్వహించారు. ఇండియన్ మేరీ టైం యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ కెప్టెన్ యోగేష్ చంద్ర లాల్ షా హాజరై ఆంధ్రప్రదేశ్‌లో 13 పెద్ద నదులు ఉన్నాయని, ఈ నదులను సముద్రానికి అనుసంధానం చేస్తూ రవాణా వ్యవస్థను ఏర్పాటు చేసి టూరిజాన్ని అభివృద్ధి చేసుకుంటే గ్రామాలు, రహదారులు, రవాణా, మౌలిక సదుపాయాలు అవకాశాలు మెరుగుపడతాయని తెలియజేశారు. అనంతరం హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ జాలాది రవి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య, రిసోర్స్ పర్సన్ కెప్టెన్ యోగేష్ చంద్రలాల్ షాను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బడి బయట శబ్దాలతో చదువులకు ఆటంకం


బర్మాక్యాంప్‌లో జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ప్రహరీ వద్ద నిలిపిన వాహనాలు

మురళీనగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సర్కారీ బడి అంటే అందరిదీ అని భావిస్తున్న కొందరు స్కూలు చుట్టు జాగా ఆక్రమిస్తున్నారు. 49వవార్డు బర్మా క్యాంప్‌లో ఈ తంతు మరీ ఎక్కువగా ఉంది. ప్రాథమిక పాఠశాల భవనానికి కేటాయించిన కె.కాలనీ రౌండ్ టేబుల్ జీవీఎంసీ కొత్త భవనం చుట్టూ విద్యార్థుల రాకపోకలకు ఆటంకంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. ప్రహరీ పొడవునా ద్విచక్రవాహనాలే దర్శనమిస్తున్నాయి. బర్మాక్యాంప్ ప్రధాన రోడ్డులో ఉన్న ఈ పాఠశాల భవనాన్ని అనుకొనే ఆటో కార్మిక సంఘం స్టాండ్ పేరిట వాహనాలు నిలిపి ఉంచుతున్నారు. మరోవైపు ప్రహరీని అనుకొని దుకాణాలు ఏర్పాటుచేసి దర్జాగా వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థుల సైకిళ్లకు జాగా ఉండటం లేదు. పాఠశాలలో తరగతులు కొనసాగుతున్న సమయంలో వాహనాల్లోనూ, ఆటో స్టాండ్‌లో డ్రైవర్లు ముచ్చట్లు పెడుతుండటంతో ఉపాధ్యాయులు ఇబ్బందిపడుతున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా కొత్త భవనం ప్రహరీ ఎత్తు పెంచేలా బ్లూ రేకుల్ని అమర్చుకున్నారు. ఫెన్సింగ్ రక్షణ కూడా ఏర్పాటు చేశారు. అయినా, ఆక్రమణలు, పార్కింగ్, రణగొణధ్వనులు ఇబ్బందులకు గురిచేస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. వీటిని నియంత్రించాలని కోరుకుంటున్నారు.

అల్లూరి విజ్ఞాన కేంద్రంలో కుట్టు శిక్షణ

డాబాగార్డెన్స్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏవీకే పరిశోధనా విభాగ ఇన్‌చార్జి పద్మ మాట్లాడుతూ పది మిషన్లతో ప్రారంభించిన ఈ కుట్టు శిక్షణ, డిమాండ్‌ను బట్టి మిషన్ల సంఖ్యను పెంచుతామన్నారు. మహిళలు తమ సొంత కాళ్లపై తాము నిలబడి, ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ రాజేశ్వరరావు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశం

అక్కయ్యపాలెం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): టెక్ మహీంద్రా ఫౌండేషన్ సహకారంతో నిర్మాణ్ ఆర్గనైజేషన్ వారు ఇంటర్ పాస్, డిగ్రీ అయిన 18 సంవత్సరాల నుంచి 28 సంవత్సరాల వయస్సు లోపు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు గల కోర్సులో ఉచిత శిక్షణ అందించి ఉపాధి కల్పిస్తున్నట్టు సంస్థ వ్యవస్థాపకులు, సీఈఓ మాయూర్ పట్నాల తెలిపారు. టైపింగ్, ఎంఎస్ ఆఫీస్, ఇంటర్ నెట్ కాన్సెప్ట్, ఇంగ్లీష్ కమ్యూనికేషన్, హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్, టెక్నికల్, బేసిక్ అకౌంటింగ్ కోర్సుల్లో మూడు నెలలు ఉచిత శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఎన్ఏడీ బాజీ జంక్షన్‌లో గల నిర్మాణ్ ఆర్గనైజేషన్ కేంద్రంలో నేరుగా లేదా ఫోను నంబర్ 9502874304, 6304159549లకు ఆగస్టు 10 లోపు సంప్రదించాలన్నారు.

23న బహిరంగ వేలం

మహారాణిపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి) :జీవీఎంసీ జోన్ 4 పరిధిలో వాణిజ్య సముదాయాలకు, దుకాణాలకు, కల్యాణ మం డపానికి, మార్కెట్ మెయిన్ ఆఫీస్ క్యాంటీన్‌కు 23న ఉదయం 11 గంటలకు బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నామని జోన్ కమిషనర్ మల్లయ్యనాయుడు బుధవారం ఒక ప్రక టనలో తెలియజేశారు. ఈ సందర్భంగా డైక్స్ ట్యాంక్, జగదంబా, పద్మానగర్, జూర్యబాగ్, టీఎస్ఆర్, అంగటి దిబ్బ వాణిజ్య సముదాయలు, పాత బస్టాండ్ దుకాణాలు, జీవీ ఎంసీ మెయిన్ క్యాంటీన్, అంబేడ్కర్ కల్యాణ మండపం రెల్లివీధి ఫిష్ మార్కెట్‌ను 3 సంవ త్సరాల కాల పరిమితికి గుత్తకు ఇచ్చేందుకు వేలం నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఉన్నత లక్ష్యంతో చదవాలి

- ట్రాఫిక్ ఎస్ఐ వాణిశ్రీ

అక్కయ్యపాలెం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఉత్తమ లక్ష్యంతో ఉన్నతంగా చదువుకోవాలని నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ ట్రాఫిక్ ఎస్ఐ వి.వాణి శ్రీ పేర్కొన్నారు. స్థానిక రవీంద్రభారతి పాఠశాల్లో బుధవారం నిర్వహించిన లీడర్‌షిప్ సెర్మనీలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు లీడర్ షిప్ బ్యాడ్జిలను అందజేశారు. నూతనంగా విద్యార్థినాయకులుగా ఎన్నికైన వారికి తోటి విద్యార్థులు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నార్త్ ఆంధ్రజోనల్ ఇన్‌చార్జి ఎస్ వెంకటేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డును ఆక్రమించేస్తున్నారు!


రోడ్డుకు అడ్డంగా పోసిన ఇసుక గుట్ట

డాబాగార్డెన్స్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోస్టాఫీస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న చిన్నరోడ్డు నుంచి కృష్ణాగార్డెన్స్‌కు వెళ్లే రోడ్డు మీద భవన నిర్మాణ సామగ్రి వేసి ఇష్టానుసారం అక్రమించేస్తున్నారు. బహుశా రోడ్డు నిర్మాణ సామగ్రి వేయడానికే నిర్మించి ఉంటారని పలువురు అంటున్నారు. మేయిన్ రోడ్డుకు వెళ్లేందుకు నిత్యం ఇటుగా రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఇష్టాను సారం ఆక్రమించడంతో వాహనదారులు, పాదచారులు నిత్యం అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. వార్డులో ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వార్డుల్లో జీవీఎంసీ పర్యవేక్షణ లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

భీమునిపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ అప్లికేషన్స్ బోధించడానికి గెస్ట్ అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ తెలిపారు. బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. కంప్యూటర్ కోర్సులో పిజి చేసి 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు లేదా నెట్, సెట్, పీహెచ్‌డీ చేసిన వారు అర్హులని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 22న కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని ఆమె సూచించారు.

కేంద్ర రక్షణ శాఖ మంత్రి పర్యటన రద్దు

విశాఖపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ విశాఖపట్నం పర్యటన రద్దయినట్టు అధికార వర్గాలు ప్రకటించాయి. ఆయన ఈ నెల 17వ తేదీ సాయంత్రం ఇక్కడికి వచ్చి ఆ మరుసటి రోజు అంటే 18వ తేదీన కొత్త నేవీ నౌక 'ఐఎన్ఎస్ నిస్తార్'ను ప్రారంభించాల్సి ఉంది. అనివార్య కారణాల వల్ల మంత్రి పర్యటన రద్దయిందని జిల్లా అధికార వర్గాలు తెలిపాయి.

నేడు రక్షణ శాఖ సహాయ మంత్రి రాక

విశాఖపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ గురువారం సాయంత్రం విశాఖపట్నం వస్తున్నారు. విమానాశ్రయంలో నుంచి నేవల్ డాక్‌యార్డుకు వెళ్లి అక్కడి అతిథిగృహంలో విశ్రాంతి తీసుకుంటారు. మరుసటిరోజు డాక్‌యార్డ్‌లో తూర్పు నౌకాదళం నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొంటారు.

'జిమ్నాస్టిక్స్ శిక్షణ కేంద్రం కొనసాగించాలి'

మద్దిలపాలెం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : పాండురంగాపురం ఇండోర్ స్టేడియంలోని జిమ్నాస్టిక్స్ స్పెషల్ బెడ్ శిక్షణ సౌకర్యాన్ని మల్టీస్పోర్ట్ కాంప్లెక్స్‌గా మార్చాలనే ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ వ్యవస్థాపకులు కె.రమాప్రభ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. నగరంలో రెండు దశాబ్దాలుగా పిల్లల శారీరక అభివృద్ధికి కేంద్ర బిందువుగా నిలిచిన జిమ్నాస్టిక్స్ సెంటర్‌ను కొనసాగించాలన్న తల్లిదండ్రుల డిమాండ్‌కుతమ పూర్తి మద్దతు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ జిమ్నాస్టిక్ కేంద్రం అనేక మంది చిన్నారులకు శిక్షణిచ్చి జిల్లా స్థాయి నుంచి జాతీయస్థాయికి అథ్లెట్లను తయారు చేసిందన్నారు.

ఒడిశాలో బర్డ్‌ఫ్లూ

... 5వ పేజీ తరువాయి

ఒడిశాలో బర్డ్‌ఫ్లూ రావడంతో విశాఖలో బ్యాగ్ ప్రతినిధులు ప్రధానంగా కోళ్ల వ్యాపారులు అప్రమత్తమై రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందించారు. దీనిలో భాగంగా బుధవారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కలిసి సమస్య వివరించారు. ఆయన వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు ఫోన్ చేసి ఒడిశాలో బర్డ్‌ఫ్లూ వచ్చిన విషయాన్ని తెలియజేశారు. బర్డ్‌ఫ్లూ తగ్గేంత వరకూ ఒడిశా నుంచి కోళ్ల దిగుమతి పూర్తిగా నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని గంటా కోరారు. సరిహద్దులో నిఘా పెట్టేలా శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని సూచించారు.

మాస్టర్ ప్లాన్‌పై అభ్యంతరాల వెల్లువ

... 5వ పేజీ తరువాయి

మీదుగా ప్రతిపాదించిన 18 మీటర్ల రహదారిని తొలగించాలని సంఘం ప్రతినిధులు కోరారు.

- దసపల్లా హిల్స్ సర్వే నంబరు 1196లో నౌరోజీ రోడ్డు నుంచి వాల్తేరు మెయిన్ రోడ్డును కలుపుతూ వైసీపీ పెద్దలకు మేలు జరిగేలా చేపట్టిన రహదారి విస్తరణను నిలిపివేయాలని అక్కడ నివాసితులు కోరారు. అందరికీ అవసరమైన పార్కు ఏర్పాటుచేయాలని కోరారు.
- నిడిగట్టు గ్రామంలో ప్రతిపాదిత 24 మీటర్ల రహదారి వద్దని స్థానిక రైతులు, గ్రామస్థులు కోరారు.
- హనుమంతవాక నుంచి జోడుగుళ్లపాలెం వరకూ ప్రతిపాదిత 100 అడుగుల రహదారిని 60 అడుగులకు పరిమితం చేయాలని స్థానికులు కోరారు.
- అక్కయ్యపాలెం ప్రధాన రహదారి నుంచి రైల్వే న్యూకాలనీ వరకు ప్రతిపాదిత 100 అడుగుల రహదారిని 60 అడుగులకు పరిమితం చేయాలని ఆ ప్రాంత ప్రజలు విన్నవించారు.
- లంకెలపాలెం నుంచి షీలానగర్ వరకు ప్రతిపాదించిన 80 మీటర్ల రహదారి స్థానే 60 మీటర్లు ఉండాలని జీవీఎంసీ కార్పొరేటర్ స్టాలిన్ కోరారు.
- మధురవాడలో వైజాగ్ కన్వెన్షన్ సెంటర్ పక్కనున్న 60 అడుగుల రహదారిని 100 అడుగులకు పెంచాలని ప్రతిపాదించారని, దానిని పునఃపరిశీలన చేయాలని అక్కడి వారు కోరారు.
- సాగర్‌నగర్ దాటిన తరువాత రాడిసన్ బ్లూ హోటల్ వద్ద బీచ్‌రోడ్డును 200 అడుగులకు విస్తరించాలని చూపించారని, అయితే హోటల్‌కు ఇబ్బంది లేకుండా ఇటు వైపు స్థలాలకు నష్టం జరిగేలా రహదారి నిర్మాణం ప్రతిపాదించారని, దానిని మార్చి రోడ్డు మధ్య నుంచి చెరిసగం చేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరారు.
- పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు తన నియోజకవర్గంలో సుమారు 12 రహదారులకు సంబంధించిన అంశాలపై అభ్యంతరాలు, సూచనలు చేశారు.
- విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు హైవేను కలుపుతూ బీచ్‌రోడ్డుకు గంభీరం, యాతపేట, కల్లివానిపాలెం, కోమటిపాలెం మీదుగా రహదారిని విస్తరించాలని కోరారు.
- విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ వన్‌టౌన్‌లో రహదారులను విస్తరించాలని కోరారు.

రోగులకు ఇబ్బంది లేకుండా చర్యలు

... 5వ పేజీ తరువాయి

పాడైన నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా అంటే హీమోడయాలసిస్‌కు బదులుగా అక్యూట్ పెరిటోనియల్ డయాలసిస్ చేయిస్తున్నట్టు వెల్లడించారు. పాడైన మెషీన్ల స్థానంలో కొత్తవి అందుబాటులోకి తీసుకురానున్నట్టు వెల్లడించారు. ఎన్‌టీపీసీ సంస్థ కొత్తగా పది డయాలసిస్ మెషీన్లు అందించేందుకు ముందుకువచ్చిందన్నారు. రోగులకు ఇబ్బందులు లేకుండా డయాలసిస్ సేవలు అందించేందుకు చర్యలు తీసుకున్నామని వివరించారు.

హైవేలో గ్రేడ్ సెపరేటెడ్ ఫ్లైఓవర్లు?

... 5వ పేజీ తరువాయి

స్పందించారు. ఈ ప్రతిపాదనకు ఆమోదం లభిస్తే నగరంలోని జాతీయ రహదారిపై ఫ్లైఓవర్లు వచ్చే అవకాశం ఉంది. ఇదిలావుండగా గంగవరం పోర్టు నుంచి తుంగ్లాం మీదుగా గాజువాకలో ఎన్‌హెచ్-16ను కలుపుతూ గతంలో ప్రతిపాదించిన ప్రాజెక్టుకు వెంటనే ఆమోదం తెలపాలని కోరారు. గంగవరం పోర్టు నుంచి రోజుకు సుమారు 2,500కు పైగా భారీ వాహనాలు గాజువాక వద్ద జాతీయ రహదారిపైకి వస్తున్నాయని, ట్రాఫిక్ ఇబ్బందిగా మారడంతో పాటు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని వివరించారు. ఈ సమస్య పరిష్కారానికి గతంలో బైపాస్ రహదారిని తుంగ్లాం మీదుగా ప్రతిపాదించారని, వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల అది ఆగిపోయిందని చెప్పారు. రాజకీయాల కారణంగా అభివృద్ధికి ఆటంకం కలగకూడదని, తక్షణమే ఆ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపి పనులు చేపట్టాలని కోరారు. దీనికి కూడా ఆయన సానుకూలంగా స్పందించి డీపీఆర్‌లు పరిశీలించి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్టు తెలిసింది.

వేతనాల కోసం ఎదురుచూపులు

... 5వ పేజీ తరువాయి

జీతం బిల్లు పెట్టేందుకు ఇబ్బంది లేదు. కొత్తగా కేటాయించిన పోస్టుల్లోకి వచ్చిన వారికి మాత్రమే జీతం కోసం పొజిషన్ ఐడీ రావాల్సి ఉంటుంది. దీనిని కొన్ని మండలాల విద్యాశాఖాధికారులు పరిగణనలోకి తీసుకోకపోవడంతో జూన్ నెల జీతం బిల్లు పెట్టలేకపోయారు. ఒక నెల జీతం నిలిచిపోతే తరువాత నెల రెగ్యులర్ జీతాల బిల్లులతో పెట్టేందుకు వీలులేదు. ఆగస్టు నెల తొలి వారంలో సప్లమెంటరీ బిల్లుల అప్‌లోడ్ సమయంలోనే తిరిగి బిల్లు పెట్టాలి. అంటే అందరికీ పొజిషన్ ఐడీలు వచ్చి ఆగస్టు తొలి వారంలో సప్లిమెంటరీ బిల్లుగా అప్‌లోడ్ చేస్తే సెప్టెంబరు ఒకటో తేదీన జూన్, జూలై నెల జీతాలు వస్తాయని టీచర్లు వ్యాఖ్యానిస్తున్నారు. విద్యా శాఖ, ఖజానా శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో జీతాలు సకాలంలో అందుకోలేని పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ కొనసాగింపుపై సందిగ్ధం

... 5వ పేజీ తరువాయి

దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 13 వరకూ అవకాశం ఇచ్చారు. బుధవారం నుంచి 16న ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని షెడ్యూల్‌లో ప్రకటించారు. కానీ, బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించలేదు. ఈ విషయంలో ఉన్నతాధికారులు ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి. ప్రస్తుతానికి మాత్రం అతిథి అధ్యాపకులు వర్సిటీలోని అధికారులను కలిసి తమ ఇబ్బందులను తెలియజేస్తున్నారు.



మాట్లాడుతున్న ఉక్కు జీఎం మధుసూదనరావు

రేపటి నుంచి స్టీల్ క్లబ్ వార్షికోత్సవాలు

ఉక్కుటౌన్‌షిప్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ వార్షికోత్సవాలను ఈ నెల 18 నుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్టు క్లబ్ అధ్యక్షుడు, స్టీల్ ప్లాంట్ జీఎం (హెచ్‌ఆర్) ఎం.మధుసూదనరావు పేర్కొన్నారు. క్లబ్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాంటులో పని ఒత్తిడిలో ఉన్న ఉద్యోగుల మానసిక ఉల్లాసానికి క్లబ్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. వార్షికోత్సవాల్లో సభ్యులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో క్లబ్ కార్యదర్శి పెంటకోట రామకృష్ణ, కార్యవర్గ సభ్యులు వై.రవికుమార్, డి.వేణుగోపాల్, జె.రమేశ్, భవనకిరణ్, వెంకటరాజు, ఎం.కృష్ణయ్య పాల్గొన్నారు.

పాఠశాలను తెరవాలని నిరసన

ఉక్కుటౌన్‌షిప్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని విశాఖ విమల విద్యాలయాన్ని తక్షణమే తెరవాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్కూల్ ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బి.గంగారావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు పునఃప్రారంభమై నెల రోజులు దాటిని ఇక్కడ తరగతులను ప్రారంభించక పోవడం దారుణమన్నారు. విశాఖ విమల విద్యాలయాన్ని మూసివేసేందుకు ఉక్కు యాజమాన్యం కుట్ర చేస్తుందని ఆయన ఆరోపించారు. తక్షణమే విద్యాలయం ప్రారంభానికి ఎంపీ, ఎమ్మెల్యేలు తగిన స్కూల్ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దీక్షలో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి చేయూత

అగనంపూడి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల లంకెలపాలెం కూడలిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఫార్మా ఉద్యోగి వై.ఎరప్పడు కుటుంబ సభ్యులకు బుధవారం పెదమడక మార్కండేయ సేవా సంఘం ప్రతినిధులు రూ.ఐదు వేలతో పాటు నిత్యావసర సరకులను రాష్ట్ర పద్మశాలి సంఘం కన్వీనర్ పప్పు రాజారావు చేతులమీదగా అందజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కొలిపాక అప్పారావు, గజేంద్రరరావు, డి.దేముడు, హనుమంతరావు, నరసింగరావు, జగ్గారావు, నాగేంద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లను తొలగించాలని ఎస్ఈకి వినతి

అక్కిరెడ్డిపాలెం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 68వ వార్డు పరిధిలోని గుడివాడ అప్పన్న కాలనీ ప్రాంతంలో నివాస గృహాలపై వేలాడుతున్న 33 కేవీ విద్యుత్ లైన్లను తొలగించాలని ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ జి.శ్యాంబాబుకు వైసీపీ నాయకుడు గుడివాడ లతీశ్ ఆధ్వర్యంలో పలువురు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ విద్యుత్ లైన్ల వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంతో గడుపుతున్నామని, అందువల్ల తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

సినిమా గైడ్

- **తమ్ముడు** : మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)
- **జురాసిక్ వరల్డ్** : జగదాంబ, రమాదేవి
- **కన్నప్ప** : జగదాంబ, కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి). లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ),
- **కుబేర** : సంగం, ఊర్వశి (కంచరపాలెం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఎఫ్.1** : రమాదేవి, జగదాంబ,
- **మార్గన్** : శారద, శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 30, వంకాయలు (తెలుపు) 88, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 26, పచ్చిమిర్చి 76, కాకర కాయలు 38, బీరకాయలు 34, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 40, క్యాబేజీ 20, క్యారెట్ 44, దొండకాయలు 30, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 46, అల్లం (పాతది) 48, బరబాటి 24, ముల్లంగి 24, అగాకారకాయ 75, నిమ్మకాయలు (కిలో) 42, బద్దచిక్కుడు 50, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 85, కొబ్బరికాయ (పెద్దది) 30, బీట్‌రూట్ 35, పొటల్స్ 42, బీన్స్ (పెన్సిల్) 100, కీరదోస 34, క్యాప్సికమ్ 86, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 38, కంద 50, దేముడు చిక్కుడు 84, గోరుచిక్కుడు 40, గ్రీన్ బటానీ 80, కూరపెండలం 30, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు	
బ్రాయిలర్	
రైతు ధర	73
లైవ్ ధర	93
విత్ స్కిన్	146
స్కిన్‌లెస్	166



హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు పార్కు ప్రవేశ ద్వారం



పార్కులో నిరుపయోగంగా దర్శనమిస్తున్న చిన్నారుల క్రీడా సామగ్రి

ప్రారంభానికి నోచుకోని 'అల్లూరి' పార్కు

- సుమారు 10 శాతం పనులే పెండింగ్‌లో..
- అయినా పూర్తి చేయడంపై దృష్టి సారించని జీవీఎంసీ అధికారులు
- అవసరమైతే ఆందోళన చేస్తాం: ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు

పెదగంట్యాడ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 76వ వార్డు పరిధి హౌసింగ్ బోర్డు కాలనీలో అల్లూరి సీతారామరాజు పార్కు నిర్మాణానికి కోట్లు వెచ్చించినా నిరుపయోగంగా వదిలేశారు. ఈ ఏడాది జనవరిలో ఈ పార్కును ప్రజలకు అందుబాటులోకి తెస్తామని జీవీఎంసీ అధికారులు, పాలకవర్గ సభ్యులు ప్రకటించారు. ఆ తరువాత దీని గురించి పట్టించుకునే నాథులే కరువయ్యారు. దాదాపు రూ.పది కోట్ల వ్యయంతో రెండున్నరేళ్ల క్రితం పార్కు నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రహరీ నిర్మించడంతో పాటు చిల్డ్రన్ పార్కు, జిమ్... అందుకు అవసరమైన పరికరాలను సమకూర్చారు. స్కేటింగ్ రింక్, యాంపీ థియేటర్, వాటర్ ఫౌంటెయిన్లు, వాకింగ్ ట్రాక్, షటిల్ కోర్టు, పార్కు నిర్వహణకు అవసరమైన భవనాలను నిర్మించారు. దీంతో 90 శాతం పనులు పూర్తయినట్టు అధికారులు పేర్కొన్నారు. పార్కు ఖాళీ స్థలాల్లో గ్రీనరీ ఏర్పాటు, వాటర్ పైపు లైన్లు వేయడం మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. రూ.రెండు కోట్లతో కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి పార్కుకు పైపు లైన్లు వేసేందుకు ఏడాదిన్నర క్రితం పనులు చేపట్టారు. కేబీఆర్ నుంచి సుందరయ్యకాలనీ రోడ్డు వరకు, ఆ రోడ్డు దగ్గర సుమారు వందడుగులు వదిలేసి అక్కడనుంచి పార్కు వరకు పైపు లైన్లు వేశారు. వందడుగుల మేర పైపు లైను వేయనందున పార్కుకు నీరు రావడం లేదు. వివాదంలో ఈ వందడగుల స్థలం ఉండడంతో పార్కుకు నీటి సదుపాయం అందకుండా పోయింది. ఇందుకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకునే అవకాశం ఉన్నా అధికారులు ఆ దిశగా దృష్టి సారించడం లేదని స్థానికులతో పాటు కార్పొరేటర్, ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు ఆరోపిస్తున్నారు. నీటి సదుపాయం లేక పార్కులో నాటేందుకు తెచ్చిన మొక్కలు ఎండిపోతున్నాయి. తొమ్మిది నెలలుగా ఇదే పరిస్థితి నెలకొనడంతో ప్రారంభానికి పార్కు నోచుకోని దుస్థితి నెలకొంది. పార్కుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కొద్ది శాతం పనులను త్వరితంగా పూర్తి చేయాలని మేయర్ పీలా శ్రీనివాసరావు, అధికారులను పలుమార్లు కోరినట్టు కార్పొరేటర్ తెలిపారు. ఇంకా జాప్యం జరిగితే పార్కులో ఏర్పాటు చేసిన చిన్నారుల ఆట సామగ్రి, జిమ్ పరికరాలు పాడైపోయే ప్రమాదం ఉందన్నారు. అవసరమైతే పార్కు ప్రారంభం కోసం ఆందోళన చేయామని గంధం శ్రీనివాసరావు పేర్కొన్నారు.

భూ సేకరణకు సహకరించండి

- ఎవరికీ నష్టం లేకుండా పరిహారం చెల్లిస్తాం
- మెట్రో ప్రాజెక్టు ఎస్డీసీ సుధాసాగర్

గాజువాక, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైలు ప్రాజెక్టు నిమిత్తం భూ సేకరణకు ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించవలసిందిగా మెట్రో ప్రాజెక్ట్ ఎస్డీసీ సుధాసాగర్ కోరారు. గాజువాక జోనల్ కార్యాలయంలో బుధవారం మెట్రో ప్రాజెక్టు నిర్మాణంపై ఆయా ప్రాంతాల ప్రజల నుంచి భూ సేకరణపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూర్మన్నపాలెం, వడ్లపూడి, శ్రీనగర్, చినగంట్యాడ, పాత గాజువాక, పంతులుగారి మేడ, ఆటోనగర్ జంక్షన్, బీహెచ్‌పీవీ, అక్కిరెడ్డిపాలెం, షీలానగర్ ప్రాంతాల్లో జాతీయ రహదారికి ఆనుకుని భూ సేకరణ చేపట్టాల్సి ఉందన్నారు. కూర్మన్నపాలెం నుంచి షీలానగర్ వరకు సుమారు 312 వరకు వ్యాపార సంస్థలు, గృహాలు, ఖాళీ స్థలాలను సేకరించనున్నామని, ఎవరి స్థలాలను ప్రాజెక్టు కోసం సేకరిస్తామో వారికి ఆర్‌ఆర్ ప్యాకేజీతో పాటు పూర్తి స్థాయి నష్టపరిహారం చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ విషయంలో ఎవరికీ నష్టం జరగదని స్పష్టం చేశారు. సర్వే అనంతరం మరో మూడు నెలల్లో మళ్లీ సమావేశం నిర్వహించి పూర్తి వివరాలను వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్డీసీ సుధాసాగర్

67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ పాత గాజువాక జంక్షన్‌లో మెట్రో స్టేషన్ ఏర్పాటు చేయడవ వల్ల ట్రాఫిక్ పరమైన ఇబ్బందులు వస్తాయని, ఈ స్టేషన్‌ను లంకా మైదానం సమీపంలో ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ సమస్యలు ఉండవని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని పరిశీలిస్తామని అధికారులు బదులిచ్చారు. కార్యక్రమంలో గాజువాక తహశీల్దార్ బి.శ్రీనివాసరావు, అధికారులు మాధవ్‌రెడ్డి, దేవరాజు, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులంతా సాంకేతిక రంగంపై పట్టు సాధించాలి

అగనంపూడి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సాంకేతికరంగంలో చోటుచేసుకుంటున్న విప్లవాత్మకమైన మార్పులకు అనుగుణంగా విద్యార్థులు రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డామాస్కస్ కార్పొరేషన్, మెట్రోపాలిటన్ యూనివర్సిటీ శాస్త్రవేత కె.సుగియామా పేర్కొన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో సాంకేతిక రచనపై బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సాంకేతిక రచనను ఎలా రూపొందించాలో వివరిస్తూ సరళమైన పద్ధతులను వివరణాత్మకంగా వివరించారు. అనంతరం సుగియామాను విజ్ఞాన్ ప్రిన్సిపాల్ సుధాకర్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రెక్టార్ వి.మధుసూదనరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

గాజువాక, జూలై 16 (ఆంధ్రజ్యోతి): చినగంట్యాడ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం మరమ్మతు పనులు చేపడుతున్నందున ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా కణితి రోడ్డు, చైతన్యనగర్, శాంతినగర్, గొంతినవానిపాలెం, ప్రశాంతినగర్, మోహన్‌నగర్, గ్రంథాలయం వీధి, కోర్టు ప్రాంతం, జీవీఎంసీ, తహశీల్దార్ కార్యాలయం, ఆర్కే ఆస్పత్రి ప్రాంతం, చినగంట్యాడ, ఎస్సీ కాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గోపాలపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : గోపాలపట్నం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకూ సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 ఈఈ సింహాచలంనాయుడు తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గోపాలపట్నం బంక్ ఏరియా, నరసింహనగర్, లక్ష్మీనగర్, ఎర్రచెరువు ఏరియా, చంద్రనగర్, సంతోష్‌నగర్ (ఎల్లపువానిపాలెం), గణేశ్ నగర్, ఖారవేలనగర్, డీఏఆర్ నగర్, రైల్వే స్టేషన్ రోడ్డు, నేతాజీవీధి,పాత గోపాలపట్నం, నాగేంద్రకాలనీ, సంతోష్‌నగర్, పోలీస్‌స్టేషన్ ప్రాంతాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

మల్కాపురం పరిధిలో...

మల్కాపురం : మల్కాపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలకు శుక్రవారం సరఫరాలో అంతరాయం కలగనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీకే నాయుడు తెలిపారు. 11 కేవీ త్రినాథ్‌పురం ఫీడర్ పరిధిలోని రెడ్డివీధి, మరిడిమాంబ ఆలయం ఏరియా, యాదవ వీధి, పల్లివీధి, రజకవీధి, త్రినాథ్‌పురం, గాంధీవీధి, జాలరవీధి, 11 కేవీ మల్కాపురం ఫీడర్ పరిధిలో మల్కాపురం మార్కెట్ రోడ్డు, హరిజనవీధి, శెట్టిబలిజీ వీధి, ప్రకాశ్‌నగర్, మల్కాపురం మెయిన్ రోడ్డు, నగరలవీధి, వెంకన్నపాలెం, 7 టెంపిల్స్ రోడ్డు, బాపూజీ కాలనీ ప్రాంతాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

వెస్ట్ జోన్ ట్రాఫిక్ సీఐగా సురేశ్



గోపాలపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : వెస్ట్ జోన్ ట్రాఫిక్ సీఐగా సురేశ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సోషల్ మీడియా విభాగం సీఐగా విధులు నిర్వర్తించిన ఆయన వెస్ట్ జోన్ ట్రాఫిక్ సీఐగా బదిలీపై వచ్చారు. గోపాలపట్నం, పెందుర్తి స్టేషన్ల ట్రాఫిక్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గోపాలపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెంలోని సంతోష్‌నగర్ కాలనీలో రూ. 38 లక్షలతో చేపట్టనున్న రహదారి పనులకు కార్పొరేటర్ దాడి వెంకట రమేశ్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులోని అన్ని ప్రాంతాల్లో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కొత్తపాలెం పీఏసీఎస్ ఛైర్మన్ విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఏడు వార్డుల్లోనూ అభివృద్ధి పనులు

పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం/కంచరపాలెం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ నియోజకవర్గంలోని ఏడు వార్డు ల్లోనూ అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే గణబాబు తెలిపారు. బుధవారం ఆయన నియోజకవర్గం పరిధిలోని 40,58 నుంచి 63 వార్డుల జోన్ 5 అధికారులు, సచివాలయ ఉద్యో గులు, రెవెన్యూ అధికారులు, పోలీసు సిబ్బందితో శ్రీహరిపురం వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో , కంచరపాలెం ఐటీఐ జంక్షన్ వద్ద వార్డుల అభివృద్ధి, భవిష్యత్ ప్రణాళికలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డుల పరిధిలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పను లన్నీ జోరుగా సాగాలని ఆదేశించారు. ఏడు వార్డుల్లోని పనులకు రూ. కోట్లాది కేటాయించినట్టు చెప్పారు. శ్రీహరిపురంలో ఉన్న జీవీఎంసీ ఆస్పత్రి (ఎఫ్‌ఆర్‌యూ)ని ప్రభుత్వమే నడుపుతుందని, కోరమాండల్ సీఎస్ఆర్ నిధులు ఇస్తే ప్రభుత్వం ఆస్పత్రిలో ఉచితంగా వైద్య సేవలందిస్తుందన్నారు. అలాగే మల్కాపురం శ్మశనవాటికలో అభి వృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయని, త్వరలోనే అచ్చినాయుడుతోట,ములగాడలో నిర్మించిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందిస్తామని చెప్పారు. ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జోన్ 5 కమిషనర్ రాము, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ అంగ దుర్గా ప్రశాంతి, ఆయా వార్డుల టీడీపీ అధ్యక్షులు మజ్జి సోమేశ్, కోరాడ శ్రీనివాసరావు, మాతా శ్రీను, మజ్జి మాలినాయుడు, 61వ వార్డు టీడీపీ మహిళ అధ్యక్షురాలు సర్వసిద్ది శ్రీలక్ష్మి, , టీడీపీ నాయకుడు కాకి పోలిరెడ్డి, బీజేపీ నగర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి పీఏసీఎస్ ఛైర్మన్‌గా సింహాచలంనాయుడు



పెందుర్తి, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) ఛైర్మన్‌గా అయితి సింహాచలంనాయుడు నియమితులయ్యారు. ఈమేరకు సహకార శాఖాధికారులు జారీ చేసిన ఉత్తర్వులను ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆయనకు అందజేశారు. సింహాచలం నాయుడుతో పాటు డైరెక్టర్లుగా చిరికి అవతారం, ఉగ్గిన అచ్చిబాబును నియమించారు. పులగాలిపాలేనికి చెందిన సింహాచలం నాయుడు ఆ గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబుకు ఆయన ప్రధాన అనుచరుడు. ప్రస్తుతం జనసేన పార్టీ జిల్లా కార్యదర్శిగా ఉన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

మల్కాపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : సృజనాత్మకత ఆలోచనల వల్ల మేధస్సు వికసిస్తుందని సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-3 ప్రోగ్రామ్ అధికారి వి. అంజలిదేవీ అన్నారు. కళాశాలలో నూతనంగా ప్రవేశించిన విద్యార్థినులకు సృజనాత్మక ఆలోచనా విధానంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విషయాన్ని భిన్నంగా ఆలోచించడం, విశ్లేషించడం ఉన్నత విద్యలో భాగం అన్నారు. సృజనాత్మక ఆలోచనలే నూతన ఆవిష్కరణలకు దారితీస్తాయన్నారు. అనంతరం ఆరోగ్యవంతమైన జీవన విధానంపై రసాయన శాస్త్ర అధ్యాపకురాలు నవిత తెలియజేశారు.

కొత్తపాలెం రోడ్డులో ఆక్రమణల తొలగింపు



అండర్ పాస్‌వే కూడలిలో దుకాణం తొలగింపు

గోపాలపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : కొత్తపాలెం ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణల తొలగింపును జీవీఎంసీ సిబ్బంది బుధవారం నుంచి ప్రారంభించారు. కొత్తపాలెం అండర్ పాస్‌వే కూడలి నుంచి ఆ గ్రామ శివారు భగత్‌సింగ్‌నగర్ కూడలి వరకూ రోడ్డుకి ఇరువైపులా ఆక్రమణలు వెలసాయి. దీనివల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగడంతో జీవీఎంసీ అధికారులు ఆక్రమణల తొలగింపునకు ఉపక్రమించారు. ఉదయం సుమారు 30 మంది జీవీఎంసీ సిబ్బంది, 20 మంది పోలీసులు అక్కడికి వెళ్లి ఆక్రమణలు తొలగించాలని దుకాణారులకు తెలిపారు. కొందరు కాస్త సమయం ఇస్తే తొలగిస్తామని చెప్పారు. దీంతో రహదారికి ఆనుకుని దుకాణదారులు ఏర్పాటు చేసిన ఫెక్సీలు, సైన్‌బోర్డులను తొలగించి జీవీఎంసీ, పోలీసు సిబ్బంది వెనుదిరిగారు. కాగా అండర్‌పాస్‌వే కూడలి నుంచి కొత్తపాలెం శివారు వరకూ రహదారికి ఇరువైపులా చాలామంది దుకాణదారులు రోడ్డు పైకి వచ్చి వ్యాపారాలు చేస్తున్నారు. అండర్‌పాస్‌వే కూడలిలో అయితే దాదాపుగా ఆక్రమణలే ఎక్కువ. ఆక్రమణల వల్ల కూడలిలో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఆక్రమణలు తొలగించాలని చాలాకాలంగా అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఎట్టకేలకు ఆ ప్రక్రియను మొదలుపెట్టారు.



సదాశివమూర్తిని సత్కరిస్తున్న అధికారులు, కార్మిక నాయకులు

భెల్ హెచ్‌పీవీపీ యూనిట్‌ను సందర్శించిన ఛైర్మన్

అక్కిరెడ్డిపాలెం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): భెల్ ఛైర్మన్ సదాశివమూర్తి బుధవారం బెల్‌హెచ్‌పీవీపీ యూనిట్‌ను సందర్శించారు. యూనిట్‌కు తొలిసారిగా విచ్చేసిన ఆయనకు అధికారులతో పాటు కార్మిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కర్మాగారంలో పలు విభాగాలను ఆయన సందర్శించారు.తరువాత కార్మిక నాయకులు, అధికారులతో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు శ్రమించి కర్మాగారానికి లాభాలు తీసుకువస్తున్నారని, భవిష్యత్తులో మంచి వర్క్ ఆర్డర్లు లభిస్తాయని, వాటిని సకాలంలో పూర్తి చేసి కర్మాగారానికి మరింతగా లాభాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం ఛైర్మన్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భెల్ హెచ్‌పీవీపీ ఈడీ జి.సుబ్రహ్మణ్యం, అధికారులు గౌరీశంకర్, ఎస్.లీల, గుర్తింపు కార్మిక సంఘం నాయకులు ఎస్.సాహూ,బి.బాబూరావు, దేముడు, పీవీఎన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

86వ వార్డులో పార్కు స్థలాన్ని పరిరక్షించరూ..



ఆక్రమణకు గురైన పార్కు స్థలాన్ని చూపిస్తున్న కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు

కూర్మన్నపాలెం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పార్కు అభివృద్ధి మాట అటుంచితే... యథేచ్ఛగా కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్కు స్థలం కబ్జాకు గురవుతుందని పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసి వినతి పత్రాలు అందించినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోతున్నారు. జీవీఎంసీ 86వ వార్డు పరిధి వుడా ఫేజ్-6 లేఅవుట్ 2002లో ఏర్పాటైంది. ఇక్కడ సర్వే నంబర్-69లో పార్కు నిర్మాణం కోసం 2.10 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఇటీవల ఈ పార్కు స్థలాన్ని ఆనుకుని సర్వే నంబర్-70లో ఉన్న కొందరు భవన నిర్మాణం చేపట్టారు. వారు పార్కు స్థలాన్ని కొంత ఆక్రమించి భవన నిర్మాణాన్ని చేపట్టారంటూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు అమిరెడ్డి మురళీధరరెడ్డి, గోగినేని మల్లికార్జున్‌లు వాపోతున్నారు. బుధవారం పార్కు స్థలం కబ్జా జరిగిన ప్రాంతాన్ని అసోసియేషన్ ప్రతినిధులు విలేకరులకు చూపించారు. భవన నిర్మాణదారుడు ఇక్కడ కుక్కలను పెంచుతుండడంతో పార్కులో వాకింగ్ చేసేందుకు వచ్చేవారంతా భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. 23 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని పార్కు స్థలాన్ని గాజువాక ఎమ్మెల్యేతో పాటు జీవీఎంసీ అధికారులు పరిశీలించి... పరిరక్షణకు పటిష్ఠ చర్యలు చేపట్టడంతో పాటు పార్కు నిర్మాణానికి తగిన చర్యలు చేపట్టవలసిందిగా కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు బి.బాలాజీ, కె.శ్రీనివాస్, పి.శ్రీధర్ వర్మ, వీవీ రామరాజు, గోపాల్, కుమార్‌లు కోరుతున్నారు.

మరో 20 ఏళ్లు కూటమిదే అధికారం

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు



పినగాడిలో ఇంటింటి కుళాయిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

పెందుర్తి, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : కూటమి పాలనతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు, నియోజకవర్గంలో ఏడాదిలో రూ.229 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. బుధవారం ఆయన పినగాడిలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకుడు బయిలపూడి హరగోపాల్ అధ్యక్షతన జరిగిన సభ లో పంచకర్ల మాట్లాడుతూ కూటమిలో విభేదాలకు తావులేదని, మరో 20 ఏళ్లు తమ ప్రభుత్వమే ఉంటుందని చెప్పారు. పెందుర్తిలో ఎక్కడ అభివృద్ధి కావాలని ప్రజలు కాంక్షిస్తారో అక్కడ పనులు చేయడమే తన లక్ష్యమన్నారు. కూటమిలో చిచ్చు పెట్టేందుకు కొంత మంది ప్రయత్నిస్తున్నారని, అటువంటి వారికి ఐక్యతతో అభివృద్ధి పనులు చేసి బుద్ధి చెబుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏ సీఎస్ ఛైర్మన్ అయితి సింహాచలంనాయుడు, కూటమి నాయకులు బయిలపూడి శివయ్య, గొరపల్లి సోమునాయుడు, రామునాయుడు, కరక దేవుడు, కోరిబిల్లి రామునాయుడు, మడక పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయొద్దు : సీపీఐ

మల్కాపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించ డంతో పాటు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు మల్కాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గం కార్యదర్శి కాండ్రేలు సత్యాంజనేయ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్యులను ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా విద్యుత్ చార్జీల భారం మోపుతున్నాయని విమర్శించారు. అనంతరం ఏఈకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సహాయ కార్యదర్శి గుడాల రాంబాబు, నాయకులు ఎన్వీ త్రినాథ్, కనకేశ్వరరావు, కె. శ్రీనివాసరావు, మహిళ సంఘ నాయకులు గుడాల జయ, ఎస్. లక్ష్మి పాల్గొన్నారు.

వెంకన్న ఆలయం హుండీ లెక్కింపు

పెందుర్తి, జూలై 16 (ఆంధ్ర జ్యోతి) : పెందుర్తిలోని వెంకటాద్రి శిఖరంపై ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం హుండీ ఆదాయం లెక్కించారు 90 రోజులకు గాను స్వామివారికి భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ. 6,25,541 లక్ష ఆదాయం సమకూరినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

బోరు ఏర్పాటుకు అధికారుల హామీ

ఎస్‌పీడీ జంక్షన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 52వ వార్డు ఎస్‌పీడీ జంక్షన్ దరి గౌరీనగర్ రిక్షా కాలనీలో బోరు సమస్యపై జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం అధికారులు ఎట్టకేలకు స్పందించారు. బోరు వేయకుండా కూటమి నాయకులు అడ్డుకున్నారని స్థానికులు మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఆధ్వర్యంలో బిందెలతో మంగళవారం నిరసన తెలియజేసిన విషయం తెలిసిందే. ఈమేరకు బుధవారం ఉదయం అధికారులు స్థానికులతో చర్చించి బోరు వేయడానికి సమ్మతించారు. రెండు రోజుల్లో పనులు చేస్తామన్నారు.

క్షతగాత్రునికి నిత్యావసర సరకులు అందజేత

గాజువాక, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న స్టీల్ ప్లాంట్ బీఎఫ్ విభాగం కాంట్రాక్టు కార్మికుడు బంగార్రాజును విభాగం కార్మిక నాయకులు బుధవారం పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, తామంతా అండగా ఉంటామని భరోసా ఇచ్చి మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరకులను అందజేశారు. కార్యక్రమంలో విభాగం అధ్యక్షుడు పోలీస్ నాయుడు, నాయకులు పరమేశ్, గోవింద్, గురునాథ్, తదితరులు పాల్గొన్నారు.

85వ వార్డు సమస్యలపై మేయర్‌కు వినతి

అగనంపూడి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డులో నెలకొన్న ప్రధాన సమస్యలను మేయర్ పీలా శ్రీనివాసరావుకు టీడీపీ వార్డు నాయకులు బుధవారం కలిసి వివరించారు. వార్డు పరిధిలో పూర్తి స్థాయిలో డ్రైనేజీలు, సీసీ రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేయాలని, లంకెలపాలెం వరకు మెట్రో ట్రైన్‌ను పొడిగించడంతో పాటు కొప్పాక వద్ద ఏలేరు కాలువలో మురుగు నీరు కలవకుండా చూడాలని వేడుకున్నారు. మేయర్‌ను కలిసిన వారిలో టీడీపీ వార్డు ఇన్‌చార్జి ఇల్లపు ప్రసాద్, నాయకులు గంతకోరు అప్పారావు, కె.జగదీశ్, బి.సత్యనారాయణ, బి.చందు, వి.శ్రీను, తదితరులు ఉన్నారు.

జన్మభూమి ఋణం తీర్చుకోవడానికి...

కుటుంబ సభ్యులు, స్నేహితుడితో కలిసి ఫౌండేషన్ ఏర్పాటు

- ప్రభుత్వ కళాశాలల్లోని 209 మంది పేద విద్యార్థులకు రూ.15 లక్షల స్కాలర్‌షిప్‌లు అందజేత
- కెనడాలో స్థిరపడిన ఓ యువకుడి ఉదారత
- ఉన్నత స్థానానికి చేర్చేది చదువే
- ఆర్థిక స్థోమత లేదని వెనుకాడవద్దంటున్న రోహన్ చెర్ల

విశాఖపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): **సాధారణంగా యుక్త వయస్సు వారంతా తల్లిదండ్రులను తమకు ఏం కావాలో అడిగి వాటిని కొనుగోలు చేసేందుకు ఇష్టపడుతుంటారు. మరికొందరు తమకు నచ్చిన సెల్‌ఫోన్, ట్యాబ్, లేదా సైకిల్‌వైపు మొగ్గుచూపుతారు. అయితే కెనడాలో ఉంటున్న జగన్నాథ భాస్కర రోహన్ చెర్ల మాత్రం ఇందుకు భిన్నంగా నిలిచాడు. తల్లిదండ్రులు విశాఖ ప్రాంతానికి చెందినవారు కావడంతో ఏడాదిలో ఒక్కసారి జన్మభూమిపై మక్కువతో వస్తుండేవారు. ఇదే సమయంలో 16 ఏళ్ల ప్రాయంలో రోహన్ చెర్లకు కలిగిన సందేహాన్ని తల్లి చెవిలో వేశాడు.**

నేను, నా స్నేహితులందరూ అక్కడ (కెనడా) చదువుకోవడం, ఆడుకోవడం చేస్తుంటాం కదా! మరి ఇక్కడ (భారత్‌లో) ఎందుకు పనులు చేస్తున్నారని అడిగాడు. మన దేశంలోని ఆర్థిక పరిస్థితులు, ఇబ్బందులను తల్లి చెప్పడంతో రోహన్ చెర్ల ఆలోచనలో పడ్డాడు. దీంతో మరుసటి ఏడాది తనకు ఇంట్లో ఇచ్చిన పాకెట్‌మనీ, ఇతరత్రా డబ్బులను జాగ్రత్తగా దాచాడు.

విశాఖ జిల్లాలో చదువుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నవారిని ఆదుకుంటానని చెప్పడంతో తల్లిదండ్రులు సంతోషంతో ప్రోత్సహించారు. ఈ నేపథ్యంలో తనతో పాటు తల్లి, అమ్మమ్మ, కెనడాకు చెందిన తన మిత్రుడు జోసెఫ్‌తో కలిసి జేబీ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశాడు. ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న పేద విద్యార్థుల ఫీజును స్కాలర్‌షిప్‌ల ద్వారా అందించాలని నిర్ణయించుకున్నారు. అనుకున్న విధంగా 2023లో స్థాపించిన జేబీ ఫౌండేషన్ ద్వారా 209 మంది విద్యార్థినీ, విద్యార్థులతో (ఏవీఎన్, బీవీకే, ప్రభుత్వ మహిళా కళాశాలలు) ముఖాముఖి నిర్వహించి వారికి రూ.15 లక్షల స్కాలర్‌షిప్‌ను అందజేశారు.



ప్రభుత్వ కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులకు ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న రోహన్ చెర్ల

అందరూ చదువుకోవాలి



కెనడాలోని ప్రతి ఒక్కరూ చదువుకుంటారు. ఆడుకుంటారు. కానీ మన దేశంలో అలా ఎందుకు లేదో తెలియదు. చదువుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో సహాయం చేయాలని నిర్ణయించుకున్నా. ఈ నేపథ్యంలో నిరుడు తల్లిదండ్రులు ఇచ్చిన పాకెట్‌మనీతో కొంత మందికి స్కాలర్‌షిప్‌ను అందజేశాం. అయితే చదువుకుంటూనే తాను కళాశాలలోని చారిటీ షో చేయడం ద్వారా కొన్ని డాలర్లు ఫౌండేషన్‌లో జమ చేశా. అనంతరం సహాయాన్ని అందించాలని నిర్ణయించుకోవడంతో పాటు ఈ ఏడాది మాత్రం ప్రభుత్వ కళాశాలలో స్వయంగా ఇంటర్వ్యూ చేసి ఎవరికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయో గుర్తించి వారందరికీ సహాయాన్ని స్కాలర్‌షిప్ రూపంలో తన స్నేహితుడు జోసెఫ్‌తో కలిసి అందజేశాను. ఎట్టిపరిస్థితుల్లోనూ చదువు ఆపకూడదని, చదువు ద్వారా వ్యక్తిగతంగా ఎవరి కాళ్లపై వారు బతికే అవకాశం ఉంటుందని చెప్పాను. ఉన్నత స్థానాల్లో ఉన్న ప్రతి ఒక్కరూ సహాయం చేసేందుకు ముందుకు వస్తే పేద విద్యార్థులందరూ చదువుకోవచ్చు. భవిష్యత్‌లోనూ ఈ సేవలు కొనసాగిస్తాను.

రోహన్ చెర్ల,
జేబీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు

మంచి పనులకు సహకారం



తమ కుమారుడు స్వదేశానికి సేవలందించడం చాలా సంతోషంగా ఉంది. తనకు వచ్చిన ఆలోచనను ప్రోత్సహించడంలో తల్లిదండ్రులుగా తాము ఎప్పుడూ ముందుంటాం. జీవితంలో చదువుకే అత్యంత ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా మంచి భవిష్యత్ ఏర్పడుతుంది. దీంతో పాటు స్వదేశానికి కూడా సేవలు అందించేందుకు అందరూ ముందుకు వస్తే మరింతగా పేదవిద్యార్థులకు చేయూత ఇవ్వవచ్చు. తన కుమారుడు రోహన్‌తో పాటుగా జోసెఫ్‌ను కూడా ఇందులో భాగస్వామ్యం కావడం చాలా సంతోషకరంగా ఉంది.

-సాయి హిరణ్మయి, రోహన్‌చెర్ల తల్లి

స్ఫూర్తిదాయకం



అతి చిన్న వయస్సులోనే జేబీ ఫౌండేషన్ ద్వారా స్వదేశానికి సేవలందిస్తున్న రోహన్ చెర్ల, జోసెఫ్‌లు స్ఫూర్తిదాయకంగా నిలిచారు. ప్రభుత్వ కళాశాలలో ఫీజులు తక్కువగా ఉంటాయి. అవీ కూడా చెల్లించుకోలేని వారిని స్వయంగా గుర్తించి స్కాలర్‌షిప్‌ను అందజేయడం అభినందనీయం. కెనడాలో స్థిరపడినప్పటికీ స్వదేశానికి మంచి చేయాలనుకోవడం, అందులోనూ చదువుకునేందుకు సహకరించడం గొప్పవిషయం.

- రజని, అధ్యాపకురాలు, ఏవీఎన్ కళాశాల

డిస్పెన్సరీ ఆధునికీకరణకు నివేదిక పంపండి

- ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు ఆదేశం



ఎంవీపీ కాలనీలోని డిస్పెన్సరీని పరిశీలిస్తున్న ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు, ఇతర అధికారులు


ద్వారకాబస్‌స్టేషన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డిస్పెన్సరీని ఆధునికీకరించి అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని, అందుకు తగిన అంచనాలతో నివేదిక ఇవ్వాలని ఆర్టీసీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ ద్వారకా తిరుమలరావు అధికారులను ఆదేశించారు. ఎంవీపీ కాలనీలోని ఆర్టీసీ డిస్పెన్సరీని బుధవారం ఆయన సందర్శించారు. డిస్పెన్సరీ నిర్వహణ, సిబ్బంది పనితీరు, రోజూ వచ్చే రోగుల సంఖ్య, సిబ్బంది అందిస్తున్న సేవలు, పార్మసీలో ఉన్న మందులు తదితర వాటిని పరిశీలించారు. డిస్పెన్సరీ సేవలు మెరుగు పరిచేందుకు అవసరమైన వైద్యపరికరాలు, ఫర్నీచర్, మందులను సమకూర్చుకునేందుకు అంచనాలు రూపొందించి నివేదిక ఇవ్వాలని ఆర్టీసీ డిస్పెన్సరీ అధికారులను ఆదేశించారు. అనంతరం ఎంవీపీ బస్‌స్టేషన్‌ను పరిశీలించారు. బస్‌స్టేషన్‌ను మరింత పరిశుభ్రంగా నిర్వహించాలని సూచించారు. ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ కేఎస్‌బీ రెడ్డి, విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్ అండ్ ఆపరేషన్) జి.సత్యనారాయణ, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ పద్మావతి, వైద్యాధికారులు వాణీ నీలిమ, ఆశాకిరణ్ పాల్గొన్నారు.

అప్పన్న ఖజానాకు రూ.2.96 కోట్ల ఆదాయం

సింహాచలం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం పరిధిలో పలు వ్యాపారాలు చేసుకునేందుకు నిర్వహించిన బహిరంగ వేలం కమ్ సీల్డ్ టెండర్ల ద్వారా ఖజానాకు సుమారు రూ.2.96 కోట్ల ఆదాయం సమకూరింది. దేవస్థానం కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాథరావు ఆదేశాల మేరకు దేవదాయశాఖ ప్రత్యేక అధికారి బండారు ప్రసాద్ పర్యవేక్షణలో మంగళవారం ఈవో కార్యాలయంలో అధికారులు వేలం నిర్వహించారు. దానిలో ప్రధానంగా సింహగిరిపై భక్తులు సమర్పించిన కొబ్బరి ముక్కలు పోగు సేకరించుకునే ందుకు జరిగిన వేలం ద్వారా అత్యధికంగా రూ.91 లక్షలు, కొబ్బరికాయలు, పూజాసామగ్రి విక్రయించుకునే లైసెన్స్‌కు రూ.72 లక్షల ఆదాయం సమకూరింది. దేవస్థానం పరిధిలోని పలు ప్రాంతాల్లో బండ్లలో ఐస్ క్రీమ్స్ విక్రయాల లైసెన్స్ ద్వారా రూ.32.6 లక్షలు, రాజగోపురం వద్ద స్పాట్ ఫొటోలు తీసుకునేందుకు రూ.32.9 లక్షలు, భక్తుల జోళ్ల భద్రపరిచేందుకు పొందే లైసెన్స్ ద్వారా రూ.35.99 లక్షలు, స్వామి వారికి భక్తులు సమర్పించు బియ్యం, పప్పులు, పాలు, పెరుగు వంటి సన్నిధి ఫలాలను సేకరించుకునే హక్కు ద్వారా రూ.5.6 లక్షలు, కొండదిగువ గురువారం సంత వేలం ద్వారా రూ.1.13 లక్షలు, గోపాలపట్నం పెట్రోల్ బంక్ దగ్గర బుధవారం మినహా ఇతర రోజుల్లో పార్కింగ్ ఫీజు వసూలు చేసుకునే ందుకు రూ.2.5 లక్షలు, వరాహ పుష్కరిణి వద్ద కొబ్బరికాయలు తదితర పూజా సామగ్రి విక్రయ హక్కు లైసెన్స్ ద్వారా రూ.5.5 లక్షలు, గ్రామదేవతలు పైడితల్లెమ్మ, బంగారమ్మలకు భక్తులు సమర్పించిన చీరలు, కొబ్బరి ముక్కలను పోగుచేసుకునే లైసెన్స్ వలన రూ.5.06 లక్షలు, దేవస్థానం పరిధిలో ఖాళీగా ఉన్న దుకాణాల వేలం తదితరాల ద్వారా మొత్తం సుమారు రూ.2.96 కోట్లు ఆదాయం సమకూరినట్లు అధికారులు ప్రకటించారు. వేలం నిర్వహణలో దేవస్థానం సహాయ కార్యనిర్వహణాధికారులు పి.జగ్గారావు, ఎన్‌వీవీఎస్ఎస్‌పి నరసింహరాజు, పర్యవేక్షణాధికారులు పాలూరి నరసింగరావు, బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వేలం నిర్వహిస్తున్న అధికారులు



మధ్యవర్తిత్వ విధానానికి ప్రోత్సాహం

- అవగాహన కోసం న్యాయవాదుల వాకథాన్

మహారాణిపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): న్యాయస్థానాల్లో కేసులకు సత్వర పరిష్కారం చూపే విధంగా మధ్యవర్తి విధానాన్ని ప్రోత్సహిస్తున్నట్లు మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్ వెంకటరమణ తెలిపారు. బుధవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయసేవలపై ప్రచారంలో భాగంగా 'దేశం కోసం మధ్యవర్తిత్వం' అనే అంశంపై అవగాహన కల్పించేలా 1 కె వాకథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని న్యాయమూర్తి వెంకటరమణ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ న్యాయస్థానాల్లో కేసులు పేరుకుపోతుండడంతో వాటి సత్వర పరిష్కారానికి ఈ విధానాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి ఆర్. సన్యాసినాయుడు, న్యాయమూర్తులు, న్యాయవాదుల సంఘం ప్రతినిధులు, శిక్షణ పొందిన మధ్యవర్తులు, పారా న్యాయ సహాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.



జెండా ఊపి వాకథాన్ ప్రారంభిస్తున్న న్యాయమూర్తి వెంకటరమణ

స్మార్ట్ ఎనర్జీ టెక్నీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

పెందుర్తి, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : విశాఖ జిల్లా పరిధి నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్ (నేక్) ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ సౌజన్యంతో నిరుద్యోగులకు ఉపాధి కల్పన నిమిత్తం పవర్ సెక్టార్ కింద జూనియర్ టెక్నీషియన్ స్మార్ట్ ఎనర్జీ మీటరు కోర్సులో మూడు నెలల ఉచిత స్వల్పకాలిక శిక్షణ ఇవ్వనున్నట్టు నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ (విశాఖ) ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో జూనియర్ టెక్నీషియన్ స్మార్ట్ ఎనర్జీ మీటరు కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. పదోతరగతి ఉత్తీర్ణులై, 18 నుంచి 45 సంవత్సరాల వయోపరిమితి గల అభ్యర్థులు అర్హులన్నారు. శిక్షణకు ఎటువంటి రుసుం చెల్లించనవసరం లేదని ఉచితంగా స్టేషనరీతో శిక్షణ అందజేయడం జరుగుతుందన్నారు.

మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తామని, శిక్షణ పూర్తయిన వారికి రూ.7,500లు స్టైయిపెండ్, కేంద్ర ప్రభుత్వ ధ్రువీకరణ పత్రం అందజేస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఫోన్ : 83090 03957లో సంప్రతించాలని ఏడీ రవికుమార్ కోరారు.

విమానాశ్రయంలో అబ్బురపరచిన మాక్‌డ్రిల్



మాక్ డ్రిల్‌లో పాల్గొన్న భద్రతా దళ, విమానాశ్రయ సిబ్బంది



సిబ్బందికి సూచనలిస్తున్న అధికారులు

గోపాలపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయంలో బుధవారం నిర్వహించిన మాక్ ఎక్సర్‌సైజ్ సందర్శకులను అమితంగా ఆకట్టుకుంది. అత్యవసర పరిస్థితులు, ప్రమాదాలు సంభవించిన సమయాల్లో విపత్తుల్ని ఎదుర్కొనడానికి విమానాశ్రయ సిబ్బంది సంసిద్ధత, సామర్థ్యాలను అంచనా వేయడానికి నిర్వహించిన ఈ మాక్ ఎక్సర్‌సైజ్ అబ్బురపరచింది. విమానాశ్రయం బేశిలో నిర్వహించిన ఎక్సర్‌సైజ్‌లో భాగంగా అగ్నిప్రమాదం సంభవించినప్పుడు ప్రయాణికుల్ని రక్షించడం, వైద్య సహాయం అందించడంతో పాటు విమానాశ్రయ సిబ్బంది రూపొందించిన ప్రతిస్పందన, ప్రణాళికల్ని అధికారులు పరీక్షించారు. ఈ సందర్భంగా విమానాశ్రయ డైరెక్టర్ మాట్లాడుతూ విమాన ప్రయాణికుల భద్రతపై విమానాశ్రయ సిబ్బందికి గల నిబద్ధత, అత్యవసర పరిస్థితుల్లో సిబ్బంది స్పందించే సమష్టి సామర్థ్యానికి ఈ మాక్ ఎక్సర్‌సైజ్ నిదర్శనమని అన్నారు. విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రయాణికులకు సురక్షితమైన భద్రతా వాతావరణాన్ని అందించడంలో విమానాశ్రయం అంకిత భావంతో సిద్ధంగా ఉందన్నారు. ఈ మాక్ రిహార్సల్స్‌లో ఐఎన్ఎస్-డేగా, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, సీఐఎస్ఎఫ్, ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఇండియా వన్ ఎయిర్, ఏఏఎస్ఎల్, గ్లోబల్ ఫ్లైట్ హ్యాండ్లింగ్ సర్వీసెస్, జీవీఎంసీ, సివిల్ డిఫెన్స్, ఎన్‌డీఆర్ఎఫ్, స్థానిక పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రైం... crime news

కంచరపాలెంలో రౌడీషీటర్ ఆత్మహత్య



గుణశేఖర్ మృతదేహం

కంచరపాలెం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం పరిధి తుమ్మడిపాలెంలో నివాసం ఉంటున్న రౌడీషీటర్ గుణశేఖర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఐటీఐ జంక్షన్ సమీపంలో గల తుమ్మడిపాలెం ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ కోలాటి గుణశేఖర్ (28), పిడుగు వసంతతో సహజీవనం చేస్తున్నాడు. వసంతపై కూడా కంచరపాలెం స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. మంగళవారం రాత్రి 11.30 గంటల సమయంలో గుణశేఖర్ తుమ్మడిపాలెంలో గల ఇంటికి వచ్చి వసంతతో కాసేపు మాట్లాడుకుని వేరే గదిలో పడుకుంటానని చెప్పి గడియ పెట్టుకున్నాడు. కొద్ది సమయం తరువాత గదిలో నుంచి శబ్దం వినిపించడంతో వేరే గదిలో ఉన్న వసంత వెళ్లి చూడగా ఫ్యాన్‌కు గుణశేఖర్ వేలాడుతున్నట్టు గుర్తించి పెద్దగా కేకలు వేసి చుట్టుపక్కల వారిని పిలిచింది. వెంటనే వారు గడియ పగులగొట్టి గుణశేఖర్‌ను కిందకు దించి 108కి సమాచారం అందించారు. ఆ వాహన సిబ్బంది వచ్చి పరీక్షించి చూడగా అప్పటికే గుణశేఖర్ మృతిచెందినట్టు తెలిపారు. కంచరపాలెం పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందగా రాత్రి విధుల్లో ఉన్న ఎస్ఐ రవికుమార్ మృతదేహాన్ని పరిశీలించారు.బుధవారం తెల్లవారుజామున పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. గుణశేఖర్ ఆత్మహత్యకు అప్పులు, ఆర్థిక సమస్యలే కారణమై ఉండొచ్చని పలువురు భావిస్తున్నారు. కంచరపాలెం సీఐ కె.రవికుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లైంగిక దాడికి యత్నించిన యువకుడికి మూడేళ్ల జైలు, జరిమానా

విశాఖపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడికి యత్నించిన యువకుడికి మూడేళ్ల కఠిన కారాగారం, రూ. 25 వేల జరిమానా విధిస్తూ నగరంలోని పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి బుధవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో మూడు నెలలు అదనంగా సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. బాలికకు రూ.1.25 లక్షలు పరిహారంగా ప్రభుత్వం ఇవ్వాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బత్తి రాజశేఖర్ అందించిన వివరాలిలా ఉన్నాయి... వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉంటున్న ఇందానా సూర్యప్రకాష్ (19), తన ఇంటి సమీపాన ఉంటున్న బాలిక(8)ను చాక్లెట్లు ఇస్తానని ఇంటికి పిలిచి బాలికను శారీరకంగా హింసించాడు. బలవంతంగా లైంగిక దాడికి యత్నించాడు. బాలికకు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. బాలికను ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యపరీక్షలు చేయించారు. బాలికపై లైంగిక దాడి యత్నం జరిగిందని వైద్యులు చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన 2021 ఆగస్టులో జరిగింది. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ అనంతరం పోక్సో న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

భవనం పైనుంచి పడి వ్యక్తి మృతి

ఓ హోటల్ టీ మాస్టర్‌గా గుర్తింపు

పెందుర్తి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సుజాతనగర్‌లోని ఓ హోటల్‌లో టీ మాస్టర్‌గా పనిచేసిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పెందుర్తి సీఐ కేవీ సతీశ్‌కుమార్ బుధవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. హైదరాబాద్ సనత్‌నగర్‌కు చెందిన శ్రీవర్ధన్‌సింగ్ (58) ఉపాధి కోసం విశాఖ వచ్చాడు. ఈ క్రమంలో పెందుర్తి సమీపంలోని సుజాతనగర్‌లోని ఓ కేఫ్‌లో నెలరోజుల క్రితం టీ మాస్టర్‌గా చేరాడు. అతడు మద్యం తాగి పనిలోకి రావటంతో హోటల్ యజమాని సన్యాసిరావు పనివేళల్లో ఇది సరికాదని మందలించాడు. హోటల్ నిర్వాహక సిబ్బందితో కలసి ఓ ఫ్లాట్‌లో ఉంటున్నాడు. మంగళవారం వ్యాపారం లేకపోవడంతో విశ్రాంతి తీసుకుంటానని చెప్పి సిబ్బంది బస చేస్తున్న ఫ్లాట్‌కు వెళ్లాడు. అదే రోజు రాత్రి సిబ్బంది ఉంటున్న మొదటి అంతస్తు ఫ్లాట్ నుంచి ఓ వ్యక్తి పడి తలకు తీవ్రగాయాలయ్యాయని భవన వాచ్‌మన్ హోటల్ యజమాని సన్యాసిరావుకు సమాచారం అందించాడు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న యజమాని కింద పడిన వ్యక్తి టీ మాస్టర్ శ్రీవర్ధన్‌సింగ్‌గా గుర్తించారు. వెంటనే వైద్యంకోసం 108కి ఫోన్ చేయగా సిబ్బంది వచ్చి వైద్య పరీక్ష చేసి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ సతీశ్‌కుమార్ క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. మద్యం తాగిన మత్తులో ప్రమాదవశాత్తు ఫ్లాట్ నుంచి జారిపడ్డాడా? లేదా ఇతర కారణాలు ఉన్నాయా? అన్న కోణంలో విచారణ చేపట్టారు. మృతుడి వద్ద ఆధార్‌కార్డు తప్ప ఇతర వివరాలు ఏవీ తెలియరాలేదని కేసు దర్యాప్తు చేస్తున్న సీఐ సతీశ్‌కుమార్ పేర్కొన్నారు.

రైళ్ల పాక్షిక రద్దు... గమ్యాల కుదింపు

విశాఖపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కేకే లైనులో సాంకేతిక కారణాల వల్ల రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో కిరండూల్ రైళ్లతోపాటు హిరాకుడ్, సమలేశ్వర్, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను పాక్షికంగా రద్దు చేయడంతోపాటు కొరాపుట్ వరకే నడిపిస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ-కిరండూల్ రాత్రి ఎక్స్‌ప్రెస్ (18515) ఈ నెల 18 వరకు విశాఖలో బయలుదేరి కొరాపుట్ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 17 నుంచి 19 వరకు కొరాపుట్‌లో బయలుదేరి విశాఖ చేరుతుంది. కొరాపుట్-కిరండూల్ మధ్య రాకపోకలు రద్దు చేశారు. అలాగే విశాఖ-కిరండూల్ పాసింజర్ (58501) ఈ నెల 17, 18 తేదీల్లో విశాఖలో బయలుదేరి కొరాపుట్ వరకు, తిరుగు ప్రయాణంలో ఇదే తేదీల్లో పాసింజర్ (58502) రైలు కొరాపుట్‌లో బయలుదేరి విశాఖ చేరుతుంది. హౌరా-జగదల్‌పూర్ సమలేశ్వర్ ఎక్స్‌ప్రెస్ (18005) ఈ నెల 17న హౌరాలో బయలుదేరి కొరాపుట్ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఇదే ఎక్స్‌ప్రెస్ (18006) ఈ నెల 18, 19లలో కొరాపుట్‌లో బయలుదేరి హౌరా చేరుతుంది. కొరాపుట్-జగదల్‌పూర్ మధ్య రాకపోకలను రద్దు చేశారు. రౌర్కెలా-జగదల్‌పూర్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ (18107) ఈ నెల 17న రౌర్కెలాలో బయలుదేరి కొరాపుట్ వరకు, తిరుగు ప్రయాణంలోని ఇంటర్‌సిటీ (18108) ఈ నెల 17, 18లలో కొరాపుట్‌లో బయలుదేరి రౌర్కెలా చేరుతుంది. ఈ సర్వీసులకు కొరాపుట్-జగదల్‌పూర్ మధ్య రాకపోకలు రద్దు చేశారు. భువనేశ్వర్-జగదల్‌పూర్ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ (18447) ఈ నెల 17న భువనేశ్వర్‌లో బయలుదేరి కొరాపుట్ వరకు, తిరుగు ప్రయాణంలో ఇదే ఎక్స్‌ప్రెస్ (18448) ఈ నెల 17, 18లలో కొరాపుట్ నుంచి బయలుదేరి భువనేశ్వర్ చేరుతుంది. ఈ సర్వీసులకు కొరాపుట్-జగదల్‌పూర్ మధ్య రాకపోకలు రద్దు చేసినట్లు డీసీఎం పేర్కొన్నారు.

అశోక్ గజపతిరాజుకు అభినందన



అశోక్‌గజపతి రాజుకు జ్ఞాపిక అందిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, సీఎంఆర్ అధినేత మావూరి వెంకట రమణ, చిత్రంలో అశోక్ కుమార్తె

విశాఖపట్నం, జూల్ 16 (ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్‌గా నియమితులైన కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజును సీఎంఆర్ సంస్థల అధినేత మావూరి వెంకట రమణ బుధవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మద్దినేని సురేశ్, అశోక్ గజపతిరాజు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.